www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 028 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com బుధవారం 13 - 05 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool





పోక్సో కేసు బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు
నేడు మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని నోటీసులు




## ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
- వారం రోజుల్లో అమరావతిలోని ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం
- 20 రోజుల్లో ఎమ్మెల్సీల భవనాలను జీఏడీకి అప్పగిస్తామన్న నారాయణ
- అధికారులు, మంత్రుల భవనాలు కూడా తుది దశకు చేరుకున్నాయని వెల్లడి
- ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని 2027 ఆగస్ట్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యమన్న మంత్రి

# 24 గంటల్లోనే కొత్త వాహనం రిజిస్ట్రేషన్

- కొత్త వాహనం రిజిస్ట్రేషన్ 24 గంటల్లో పూర్తి కావాలి
- ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో పెను మార్పు
- 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారి స్పందించకపోతే ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్
- సెలవు దినాల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్న మంత్రి



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో పెను మార్పులు తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం వాహనదారులకు భారీ ఊరటనిచ్చే వార్తను అందించింది. ఇకపై కొత్త వాహనం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే, డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత సంబంధిత అధికారి 24 గంటల్లోపు దానిపై స్పందించకపోతే, ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లుగా - మిగతా 2 లో

ఇవాళ 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను

## కలవడం సంతోషంగా ఉంది



- మంత్రి నారా లోకేష్
- గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ
- అసోం సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నేతలు
- గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించిన లోకేష్
- ఏపీలో జరుగుతున్న పనులను గడ్కరీ ప్రశంసించారని వెల్లడి

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన - మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాలకు తాగునీటి విడుదల

- కేఆర్ఎంబీ నిర్ణయం
- ముగిసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం
- తెలంగాణ, ఏపీ తాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలకు నిర్ణయం
- శ్రీశైలం, సాగర్ నుంచి నీటి విడుదలకు కుదిరిన అంగీకారం



**హైదరాబాద్ :** తాగునీటి అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల, తెలంగాణకు 21 టీఎంసీల విడుదలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అనుమతించింది. హైదరాబాద్ జలసౌధ వేదికగా జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాగునీటి అవసరాల కోసం మే నెలాఖరు వరకు సాగర్ కుడి కాల్వ నుంచి 10 టీఎంసీలు ఇవ్వాలని ఏపీ ఇప్పటికే బోర్డును కోరింది. జూలై నెలాఖరు వరకు శ్రీశైలం నుంచి 5, సాగర్ నుంచి 13 టీఎంసీల నీరు ఇవ్వాలని తెలంగాణ కోరింది.తాగునీటి కోసం నిర్ణయం : రెండు రాష్ట్రాల అవసరాలపై కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీ ఈఎన్సీలు రమేష్ బాబు, నర్సింహమూర్తి చర్చించారు. ఏపీ ఇప్పటికే కోటాకు మించి నీటిని వాడుకొందని, మళ్లీ ఇస్తే తమకు నష్టం జరుగుతుందని తెలంగాణ ఈఎన్సీ తెలిపింది. అయితే తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్లు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా - మిగతా 2 లో

## భూమిని వేడెక్కిస్తుంది... గాలిని చల్లబరుస్తుంది.. ఏమిటది?


- భూమిని వేడి చేసే కార్బన్ డయాక్సైడ్ పై వాతావరణాన్ని చల్లబరుస్తోంది
- ఈ వింత ప్రవర్తన వెనుక ఉన్న కారణాలను తాజా అధ్యయనంలో గుర్తించిన శాస్త్రవేత్తలు
- దిగువ వాతావరణంలో దుప్పటిలా, పైపొరలలో రేడియేటర్‌లా పనిచేస్తున్న కార్బన్ డయాక్సైడ్
- 1980ల నుంచి స్ట్రాటోస్ఫియర్ సుమారు 2 డిగ్రీల మేర చల్లబడినట్లు వెల్లడి




# సరిహద్దులో భారత్ ఫెన్సింగ్

- ఘాటుగా స్పందించిన బంగ్లాదేశ్
- భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో కంచె నిర్మాణం
- బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయించిన బెంగాల్ లోని సువేందు ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వంతోనే తమకు సంబంధాలు ఉంటాయన్న బంగ్లా విదేశాంగ శాఖ సలహాదారు




## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్

- తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- హైదరాబాద్‌లో ఇళ్ళ స్థలాలు ఉంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్న మంత్రి
- జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడి
- విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామన్న మంత్రి

# కవితకు కోర్టు నోటీసులు



- కోర్టుకు హాజరు కావాలంటూ కవితకు నోటీసులు
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో రైల్ రోకో
- కవితపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు
- విచారణకు రావాలంటూ సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సమన్లు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన - మిగతా 2 లో

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలు తప్పవు
- రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దిశానిర్దేశం
- కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశాలు
- ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ



**హైదరాబాద్ :** రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఆదేశించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలన్నారు.రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల - మిగతా 2 లో

# సంపాదకీయం

## అంకెల వలయంలో శ్రామికుడు !

మన కాలంలో అత్యంత భయంకరమైన అబద్ధాలు అందమైన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల రూపంలోను, రంగురంగుల చార్టులు, నివేదికల రూపంలోను వస్తాయి. ఆధునిక సామ్రాజ్యవాదం ఇప్పుడు దేశాలను ఆక్రమించడం లేదు, అది నేరుగా మనుషుల శ్రమనూ, వారి జీవించే హక్కును ఆక్రమిస్తోంది. ఈ వ్యవస్థీకృత హింసను కప్పిపుచ్చడానికి కార్పొరేట్ శక్తులు ఎంచుకున్న తాజా ఆయుధమే ఇటీవలి 'వర్క్ ఇండియా' నివేదిక.ఈ నివేదికను పైపైన చూస్తే, భారతదేశంలో శ్రామికవర్గం పాలు తేనెల్లో తేలియాడుతున్నట్లు, వారి జీవితాల్లో ఏదో అద్భుతమైన స్వర్ణయుగం నడుస్తున్నట్లు అనిపిస్తుంది. బ్లూ కాలర్ కార్మికులు వైట్ కాలర్ ఉద్యోగుల కంటే వేగంగా ఎదుగుతున్నారని, వారి జీతాలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఒక అద్భుతమైన భ్రమను అల్లుతుంది. కానీ, ఈ అంకెల తెరను చీల్చి చూస్తే అక్కడ కనిపించేది అభివృద్ధి కాదు, దశాబ్దాలుగా రక్తం చిందించి కార్మికులు సాధించుకున్న హక్కులపై ముప్పేట దాడి.వర్క్ ఇండియా నివేదిక యాజమాన్యాల ప్రయోజనాల కోసం పకడ్బందీగా అల్లిన ఒక కార్పొరేట్ కుట్ర. గణాంకాల గారడీ, ఆకలిని కప్పిపుచ్చే అంకెల అబద్ధం. ఈ నివేదిక ప్రకారం, 2024లో బ్లూ కాలర్ కార్మికుల సగటు వేతనం నెలకు రూ.14,056 ఉంటే, 2025 నాటికి అది 8.6శాతం పెరిగి రూ.15,265కు చేరిందట. కాగితాల మీద ఈ 8.6 శాతం అనేది ఒక అద్భుతమైన వృద్ధి లాగా కనిపిస్తుంది. కానీ ఈ దేశంలో వీధి అంచున నిలబడి బతుకు పోరాటం చేసే సగటు మనిషిని అడిగితేనే, ఈ రూ.1,200 పెరుగుదల వాస్తవానికి ఒక పెంపా లేక అవమానమా అనేది అర్థమవుతుంది. మార్కెట్‌లో నిశ్శబ్దంగా తిరుగుతూ పేదవాడి కంచంలోని ముద్దను ఎత్తుకుపోయే 'ద్రవ్యోల్బణం' అనే రాక్షసుడి గురించి ఈ నివేదిక ఎందుకు మాట్లాడదు? పెట్రోల్ ధరలు, కూరగాయల ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలు ఇరవై ముప్పై శాతాలు పెరుగుతున్నప్పుడు, ఈ ఎనిమిది శాతం జీతం పెంపు అనేది కార్మికుడి కడుపు నింపుతుందా, లేక వాడిని మరింత అప్పుల ఊబిలోకి నెడుతుందా?జాతీయ లేబర్ వేజెస్ కమిషన్ స్వయంగా ఒక సెమీ-స్కిల్డ్ వర్కర్‌కు నెలకు కనీసం రూ.30,000 (రోజుకు రూ. 1,000) వేతనం ఉండాలని ఘోషిస్తుంటే, కార్పొరేట్ రాబందులు మాత్రం రూ.15,265 ఇచ్చి, అదేదో మహాభాగ్యం అన్నట్లు నివేదికలు వండివార్చడం వారి అహంకారానికి, శ్రమ దోపిడీకి పరాకాష్ఠ. నిజమైన వృద్ధి అనేది మార్కెట్ ధరలకు అనుగుణంగా ఉండాలి, దాని ప్రకారమైతే ఇక్కడ కార్మికుడి జీవితం పాతాళానికి దిగజారుతోంది.పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎప్పుడూ ఒక పాత వ్యూహం ఉంటుంది. "బాధితులను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పు, అప్పుడు వారు అసలు దోపిడీదారుడిని ప్రశ్నించరు." వైట్ కాలర్, బ్లూ కాలర్ ఉద్యోగుల జీతాలను పోల్చడం వెనుక ఉన్న కుట్ర ఇదే. వైట్ కాలర్ ఉద్యోగికి (అడ్మినిస్ట్రేషన్ సపోర్ట్) కనీసం బేసిక్ జీతంతో పాటు ప్రతి ఏటా పెరిగే డీఏ, టీఏ వంటి రక్షణ కవచాలు ఉంటాయి. కానీ అగ్నిగుండం లాంటి ఫ్యాక్టరీలో, ఎండలో కరిగే బ్లూ కాలర్ కార్మికుడికి దక్కేది కేవలం ఆ కనీస వేతనం మాత్రమే. ఈ రెండు వర్గాలను పోల్చి, "చూడండి ఏసీ గదుల్లో ఉండే వైట్ కాలర్ ఉద్యోగుల కంటే బ్లూ కాలర్ కార్మికులకే జీతాలు ఎక్కువగా పెరుగుతున్నాయి" అని ప్రచారం చేయడం ఒక పచ్చి అబద్ధం. సమాజంలో కార్మికుల పట్ల ఉండే సానుభూతిని చంపేసి, "వారికి అన్నీ అందుతున్నాయి, వారు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు" అనే ఒక తప్పుడు నెరేటివ్‌ను ప్రజల మెదళ్లలో నాటడానికే ఈ తరహా నివేదికలు వెలువడుతూంటాయి.ఈ నివేదికలు ఎందుకు ఇప్పుడే పుట్టుకొస్తున్నాయి? కార్మికులు శతాబ్ద కాలంగా రక్తం, కన్నీరు చిందించి, లాఠీ దెబ్బలు తిని సాధించుకున్న 29 చట్టాలను చెత్తబుట్టలో వేసి, కేవలం నాలుగు 'లేబర్ కోడ్స్'ను ప్రభుత్వాలు అమలు చేయబోతున్నాయి. ఈ కోడ్స్ అన్నీ యాజమాన్యాల దోపిడీని చట్టబద్ధం చేసేవే. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ముసుగులో జరుగుతున్న ఈజ్ ఆఫ్ ఎక్స్‌ప్లాయిటింగ్ హ్యూమన్స్ (మనుషులను దోచుకునే వెసులుబాటు) ఇది. క్రూరమైన నాలుగు లేబర్ కోడ్స్‌కు సామాజిక మద్దతును కూడగట్టడానికే ఇలా కార్మికుల జీతాలపై అక్కసు వెళ్లగక్కుతూ నివేదికలు ఇప్పిస్తున్నారు.పెట్టుబడిదారీ వ్యవస్థకు మానవత్వం ఉండదు, దానికి తెలిసింది లాభం మాత్రమే. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న మినీ వరల్డ్ వార్‌ను సైతం మన దేశంలోని కార్పొరేట్ శక్తులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నాయి. కార్మికుల జీతాల్లో కోత విధించడానికి, కనీస వేతనాలు పెంచకుండా ఉండటానికి అంతర్జాతీయ పరిణామాలను అవి ఒక సాకుగా వాడుకుంటాయి. సంక్షోభం వచ్చినప్పుడు నష్టాలను కార్మికుల నెత్తికి రుద్దడం, లాభాలు వచ్చినప్పుడు వాటిని స్విస్ బ్యాంకుల్లో దాచుకోవడం కార్పొరేట్ సంస్థల నైజం.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కేవలం పీల్చుకోవడానికి గాలిని మాత్రమే కాదు, ప్రతి పౌరుడికి 'గౌరవప్రదమైన జీవన హక్కు'ను ప్రసాదించింది. పెరుగుతున్న ధరల మధ్య రూ.15,000తో నెట్టుకొచ్చే జీవితం గౌరవప్రదమైనది కాదు. ఇది కేవలం కొద్దిమంది జీతాల సమస్య కాదు. ఇది శ్రామిక వర్గం మనుగడకు, కార్పొరేట్ విధ్వంసానికి మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ అంకెల గారడీని, ఈ నివేదికల విషాన్ని కార్మిక లోకం గుర్తించాలి. బ్లూ కాలర్, వైట్ కాలర్ అనే భేదాలు మర్చిపోయి ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా నిలబడాలి. మన నెత్తురును లాభాలుగా మార్చుకునే ఆ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఎలుగెత్తి పోరాడాలి.

## 24 గంటల్లోనే కొత్త వాహనం రిజిస్ట్రేషన్

**మొదటిపేజీ తరువాయి -** పరిగణించబడుతుంది. ఇది దేశంలోనే ఒక విప్లవాత్మక నిర్ణయం అని చెప్పవచ్చు. దీనివల్ల వాహనదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. సెలవు దినాల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, కేవలం ఫ్యాన్సీ నంబర్లను కోరుకునే వాహనదారులకు మాత్రమే ఈ 24 గంటల నిబంధన నుంచి మినహాయింపు ఉంటుంది, ఎందుకంటే ఆ ప్రక్రియ వేలం ద్వారా జరుగుతుంది. సామాన్య వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అవినీతికి తావులేకుండా సేవలు అందించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం.

## ఇవాళ 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది



**మొదటిపేజీ తరువాయి -** వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని కొనియాడారు.ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు. ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

## కవితకు కోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి -** డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్‌రోకో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఆమెతో పాటు మరో 12 మందిపై రైల్వే యాక్ట్‌లోని యూ/సెక్షన్ 147, 74(ఏ) కింద కేసులు నమోదయ్యాయి.ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కవితకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది.

## ఎమ్మెల్యేల భవనాలను జీఏడీకి అప్పగిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. నిర్ణీత గడువులోగా భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా, రాజధాని ప్రాంతంలో పర్యటించిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవనాలు దాదాపుగా పూర్తికావొచ్చాయని మంత్రి వెల్లడించారు. మరో వారం రోజుల్లో ఎమ్మెల్యే భవనాలను, మరో 20 రోజుల్లో ఎమ్మెల్సీ భవనాలను సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తామని తెలిపారు.అధికారులు, మంత్రుల నివాస భవనాలు కూడా తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన చిన్నపాటి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియపై కూడా మంత్రి క్లారిటీ ఇచ్చారు. ఇప్పటికే 98.6 శాతం మంది రైతులకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, మిగిలిన స్వల్ప శాతం ప్లాట్లు కొన్ని వివాదాల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఇక అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని 2027 ఆగస్ట్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**మొదటిపేజీ తరువాయి -** కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ధాన్యం సేకరణలోని సమస్యలపై వివరాలను తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా ధాన్యం సేకరణలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతన్నలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం పూర్తి వివరాలను ఆయా జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.సే ఎకరించిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులోకి తీసుకురాని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలని ఆదేశించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గిడ్డంగుల సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని తాత్కాలికంగా రైతు బజార్లు,



ఫంక్షన్ హాల్స్‌కు తరలించాలని సీఎం సూచించారు. వెసులుబాటు ఆధారంగా అక్కడి నుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దని చెప్పారు. అవసరమైన చోట పోలీసుల సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలని తెలిపారు.అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని సీఎం తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు.కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

## తెలుగు రాష్ట్రాలకు తాగునీటి విడుదల

**మొదటిపేజీ తరువాయి -** అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దీంతో ఏపీ విజ్ఞప్తి మేరకు ఆగస్టు నెలాఖరు వరకు సాగర్ కుడి కాల్వ నుంచి పది టీఎంసీలు ఇచ్చేందుకు అనుమతించారు.గురువారం బోర్డు పూర్తి స్థాయి సమావేశం : ఏపీకి పది టీఎంసీలుపోగా రెండు ఉమ్మడి జలాశయాల్లో మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని, మళ్లీ ఇవ్వరాదని తెలంగాణ ఈఎన్సీ అన్నారు. శ్రీశైలంలో 5 టీఎంసీలకుపైగా, నాగార్జునసాగర్‌లో దాదాపు 16 టీఎంసీల వరకు తెలంగాణ వినియోగానికి త్రిసభ్య కమిటీ అనుమతించింది. అటు గురువారం బోర్డు పూర్తి స్థాయి సమావేశం జరగనుంది. ఆ సమయంలో నీటి వాటాలు సహా అన్ని అంశాలపై చర్చ జరగనుంది.ఈ నెల 14న మరోసారి సమావేశం : త్రిసభ్య కమిటీ సమావేశం సాఫీగా సాగిందని ఏపీ ఈఎన్‌సీ నరసింహమూర్తి తెలిపారు. ఆగస్టు 15 వరకు ఏపీ నీటి అవసరాల కోసం 10 టీఎంసీలు, తెలంగాణకు శ్రీశైలం నుంచి 5, సాగర్ నుంచి 16 టీఎంసీలు వినియోగించుకోవచ్చని ఏపీ ఈఎన్‌సీ ప్రకటించింది. ఈ నెల 14న జరిగే బోర్డు సమావేశంలో మిగిలిన అంశాలపై చర్చిస్తామని పేర్కొంది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తాగునీటి అవసరాలపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ ఇవాళ సమావేశమైంది. హైదరాబాద్‌లోని జలసౌధ వేదికగా కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నర్సింహమూర్తి సమావేశమయ్యారు.



## భూమిని వేడెక్కిస్తుంది... గాలిని చల్లబరుస్తుంది.. ఏమిటది?

**మొదటిపేజీ తరువాయి -** భూమిని వేడెక్కించే కార్బన్ డయాక్సైడ్.. అదే సమయంలో వాతావరణంలోని పైపొరలను చల్లబరుస్తోందంటే నమ్మగలమా? ఈ విచిత్ర ప్రవర్తన వెనుక ఉన్న రహస్యాన్ని శాస్త్రవేత్తలు తాజాగా ఛేదించారు. భూమికి హానిచేసే ఈ వాయువు ఒకేసారి వేడి చేసేదిగా, చల్లబరిచేదిగా ఎలా పనిచేస్తుందో తమ పరిశోధనలో స్పష్టంగా వివరించారు.కార్బన్ డయాక్సైడ్ రెండు విభిన్న పాత్రలు పోషిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మనం నివసించే దిగువ వాతావరణంలో ఇది ఒక దుప్పటిలా పనిచేసి, సూర్యుడి నుంచి వచ్చే వేడిని భూమి ఉపరితలం వద్ద బంధిస్తుంది. దీనివల్లే భూతాపం పెరుగుతోంది. అయితే, భూమికి సుమారు 11 నుంచి 50 కిలోమీటర్ల ఎత్తులో ఉండే స్ట్రాటోస్ఫియర్ పొరలో దీని పనితీరు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అక్కడ ఇది ఒక రేడియేటర్‌లా పనిచేస్తూ, వేడిని గ్రహించి అంతరిక్షంలోకి విడుదల




చేస్తుంది. ఫలితంగా ఆ పొర చల్లబడుతుంది.తాజా అధ్యయనం ప్రకారం, 1980ల మధ్యకాలం నుంచి ఇప్పటివరకు స్ట్రాటోస్ఫియర్ సుమారు 2 డిగ్రీల మేర చల్లబడింది. ఇది మానవ కార్యకలాపాలు లేని సహజ ప్రక్రియ కంటే పది రెట్లు వేగవంతమైనదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కొన్ని ప్రత్యేకమైన ఇన్‌ఫ్రారెడ్ కాంతి తరంగదైర్ఘ్యాలతో కార్బన్ డయాక్సైడ్ ప్రతిస్పందించడమే ఈ శీతలీకరణకు ప్రధాన కారణమని అధ్యయన బృందం కనుగొంది. కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు పెరిగేకొద్దీ ఈ ప్రక్రియ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ, పైపొరలను వేగంగా చల్లబరుస్తోందని అధ్యయన ప్రధాన పరిశోధకుడు షాన్ కోహెన్ తెలిపారు."ఈ దృగ్విషయం దశాబ్దాలుగా తెలుసు, కానీ దీని వెనుక ఉన్న పూర్తి యంత్రాంగం ఇప్పటివరకు అర్థం కాలేదు. ఇది వాతావరణ మార్పుల యొక్క ఫింగర్‌ప్రింట్ లాంటిది" అని కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్త రాబర్ట్ పింకస్ అభిప్రాయ పడ్డారు. ఈ పరిశోధన ఫలితాలు భవిష్యత్తులో ఇతర గ్రహాల వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి, అంతరిక్ష యాత్రల ప్రణాళికలకు కూడా ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

## సరిహద్దులో భారత్ ఫెన్సింగ్

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నేతృత్వంలోని నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దు రక్షణపై తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తాజాగా స్పందించింది.భారత్ సరిహద్దుల్లో ముళ్లకంచె వేయడంపై బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సలహాదారు ఎం.హెచ్. కబీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ముళ్ల తీగలకు ఢాకా భయపడదు" అని పేర్కొంటూనే, తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో తాము జోక్యం చేసుకోమని, తమకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే సంబంధాలు ఉంటాయని ఆయన వివరించారు. సవాళ్లు ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు నాయకత్వం కట్టుబడి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.బీజేపీ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం, అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే సరిహద్దు కంచె నిర్మాణ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి తొలి మంత్రివర్గ సమావేశంలోనే బీఎస్ఎఫ్‌కు అవసరమైన భూమిని కేటాయించడం ద్వారా ఈ దిశగా బలమైన ముందడుగు వేశారు. అక్రమ చొరబాట్లను అరికట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్య ఇప్పుడు పొరుగు దేశంతో ఉన్న సంబంధాలపై



ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్

**మొదటిపేజీ తరువాయి -** పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ రెండో రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండో విడతకు సంబంధించిన విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ కోసం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలిపారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా

## నిబంధనల మేరకు పని చేయకపోతే కాంట్రాక్టర్లతో పాటు అధికారుల పైన కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్ పి. రాజాబాబు



**ఒంగోలు,మే12.అక్షర టైమ్స్ :** తాగునీటికి సంబంధించిన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రమూ సహించబోనని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. నిబంధనల మేరకు పనిచేయకపోతే కాంట్రాక్టర్లతోపాటు అధికారులపైనా కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. కొండపి నియోజకవర్గంలో జరుగుతున్న తాగునీటి నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆర్.డబ్ల్యు.ఎస్. పర్యవేక్షణలో జరుగుతున్న పనుల గురించి అధికారులు ఈ సందర్భంగా వివరించారు. కాగా, ఆశించిన స్థాయిలో పురోగతి కచ్చితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పెండింగ్ పనులను తక్షణమే ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని కూడా కలెక్టర్ చెప్పారు. కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిపిఓ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్.డబ్ల్యు.ఎస్. డి.ఈ. మహేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దొనకొండ మండలంలో కిషోరి వికాస కార్యక్రమం

**దొనకొండ,మే 12.అక్షర టైమ్స్ :** దొనకొండ మండలం, ఆరవల్లిపాడు సెక్టార్, ఇండ్ల చెరువు , పివెంకటాపురం, చందవరం,అంగన్వాడి సెంటర్ ల నందు మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో కిషోరి వికాసం ప్రోగ్రాం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా కిషోరి వికాసం ప్రోగ్రాం రక్తహీనత రక్తంలో ఇనుము లోపం వలన రక్తహీనం వస్తుంది, అలసట తిరగడం లక్షణాలు కనిపిస్తాయి. ఇనుము అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. విటమిన్ సి ఇనుము శోచనకు ఉపయోగపడుతుంది, పాలకూర, బెల్లం, మాంసం ఉపయోగకరశీ. ఈ వయసులోనే వేగవంతమైన పెరుగుదల జరుగుతుంది. సమతుల్య ఆహారం మరియు ప్రోటీన్ అవసరం, రోజు ఆటలు మరియు వ్యాయామం శరీరాన్ని బలపరుస్తాయి సరైన నిద్ర పరిశుభ్రత చాలా ముఖ్యం చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి మరియు కిషోర బాలికలు హెల్త్ అండ్ న్యూట్రిషన గురించి ఆరోగ్యం అంటే శారీరక మానసిక మరియు సామాజిక సంతోషం కలిగిన స్థితి మంచి పోషకాహారం ఆరోగ్యకరమైన జీవితానికి పునాది, నా వయసులో ఏర్పడే అలవాట్లు ఎత్తును నిర్ణయిస్తాయి, పరిశుభ్రత



అలాగే ఆరోగ్యకరమైన ఆహారం వ్యక్తిగత పరిశుభ్రత వ్యాయామం అవసరం, ప్రతి వయసులో ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం, నా అలవాట్లు పెద్ద మార్పులు తీసుకొస్తాయి ఆరోగ్యం మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.అదే క్రమంలో దొనకొండ మండలం, చందవరం గ్రామంలో అంగన్వాడి కేంద్రం నందు కిశోర బాలికలు, బాలురు మరియు గ్రామ ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం, పరిశుభ్రత, బాలల సంక్షేమం మరియు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని వరికూటి నాగార్జున (పీఎస్), డి. వెంకటలక్ష్మి (ఏ డబ్ల్యు డబ్ల్యు),



ఆతాంజనేయులు (డబ్ల్యు ఎఫ్), వెంకటరత్నం (ఏఎన్ఎం), జీవన్, దేవరాజ్, అర్లయ్య (వీఆర్వో) మరియు ఆశా వర్కర్లు కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, బాలురు మరియు గ్రామ ప్రజలు పాల్గొని అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల ఉదయలక్ష్మి ఆశ కె. సత్యవతి మరియు కిషోర్ బాలికలు పాల్గొనడం జరిగినది.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు





**దొనకొండ,మే 12.అక్షర టైమ్స్ :** వైశాఖ బహుళ దశమి హనుమత్ జయంతి సందర్భంగా శ్రీ ఆనంద ఆశ్రమంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారికి ఆశ్రమ అర్చకులు మణిబాబు శర్మ చే ఉదయం 6 గంటల నుండి పంచామృత అభిషేకాలు ప్రత్యేకంగా అలంకరనలు చేసి ఆకు పూజలు, హనుమ అష్టోత్తర శతనామావళి పూజలు, హనుమత్ వ్రతం నిర్వహించి మహా నైవేద్యాలు సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. తదనంతరం దొనకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నుండి హనుమత్ శోభాయాత్ర మోటార్ సైకిల్ ర్యాలీగా భారీ సంఖ్యలో యువత జైశ్రీరామ్ – జై హనుమాన్ అంటూ నామస్మరణతో ఆశ్రమం మారుమ్రోగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు మాడిశెట్టి ప్రకాష్ రావు రమేష్ లు వడపప్పు, పానకం, మజ్జిగ అందజేశారు. తదనంతరం బైరానంద స్వామి అన్నదానం నిర్వహించారు.

# సంతమాగులూరులో ' మీకోసం '

**ఈనెల 15న అద్దంకి నియోజకవర్గస్థాయిలో నిర్వహణకు అధికారుల చర్యలు**

**వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపు**

**అదే రోజు సజ్జాపురంలో పల్లెనిద్ర**

**ఒంగోలు,మే 12.అక్షర టైమ్స్ :** అద్దంకి నియోజకవర్గం, సంతమాగులూరు మండలంలో ఈనెల 15వ తేదీన ' మీకోసం ' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో ప్రతి శుక్రవారం ఒకే నియోజకవర్గంలో ' మీకోసం ' కార్యక్రమం నిర్వహించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ఆదేశాల మేరకు జిల్లాలో తొలుత అద్దంకి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్ళమన్నారు. ఇందులో భాగంగా 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో ' మీకోసం ' కార్యక్రమం జరుగుతుంది.

**సజ్జాపురంలో పల్లెనిద్ర......**

ఈనెల 15వ తేదీ శుక్రవారం రాత్రి సంతమాగులూరు మండలంలోని సజ్జాపురంలో జిల్లా కలెక్టర్ ' పల్లెనిద్ర ' కార్యక్రమం ఉంటుంది. గ్రామస్తులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. రాత్రికి సజ్జాపురంలోనే బస చేసి శనివారం ఉదయం గ్రామంలో పర్యటిస్తారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయికి వస్తున్న దృష్ట్యా ఈ కార్యక్రమాల ద్వారా తమ సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

## ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి జయంతి వేడుకలు

**దర్శి,మే12.అక్షర టైమ్స్ :** దర్శి మెయిన్ బజార్ లోని సువర్చ ప్రసన్నాంజనేయ స్వామి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆకు పూజతో, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆంజనేయ స్వామి భక్త బృందానికి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు



**గిద్దలూరు,మే12.అక్షర టైమ్స్ :** గిద్దలూరు నియోజకవర్గం, కొమరోలు మండలం, హనుమంతరాయుని పల్లెలో వెలసిన శ్రీ స్వయంభు అభయాంజనేయ స్వామి వారిని హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మరియు వారి ధర్మపత్ని పుష్పలీల దంపతులు కుటుంబ సమేతంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమశీ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించినారు. స్వయంభువుగా వెలసిన ఈ క్షేత్రం స్థానికంగా చాలా మహిమాన్వితమైనదిగా స్థానిక, గ్రామ ప్రజలు పూజిస్తారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ,ఆయురారోగ్యాలతో ఉండాలని, స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షిశీచినారు. ఈ కార్యక్రమంలో కొమరోలు మండల ప్రముఖులు , నాయకులు , గ్రామస్తులు, తదితరులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందినారు.

# రీసర్వేతో సమస్యలు పరిష్కారం

**ఒంగోలు,మే 12.అక్షర టైమ్స్ :** జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి మంగళవారం టంగుటూరు మండలంలో పర్యటించారు. ముందుగా ఐదవ విడత రీసర్వే జరుగుతున్న వల్లూరు గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ గ్రామంలో గ్రౌండ్ ట్రూతింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. నిబంధనల ప్రకారం ముందుగా నోటీసులు ఇచ్చి రైతుల సమక్షంలోనే ఈ-కేవైసీ చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆ విధంగానే అధికారులు చేస్తున్నట్లు స్థానిక రైతులు జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. రీసర్వే ద్వారా రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం టంగుటూరు తహశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. రీసర్వేకు సంబంధించిన డేటా ను విలేజ్ సర్వేయర్ లాగిన్ లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఐసిడిఎస్ అధికారులు ఏర్పాటు చేసిన ' కిషోరి వికాసం ' కార్యక్రమంలో కూడా జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. కిషోర ప్రాయంలోని బాలికల అభివృద్ధి, ఆరోగ్యం, సాధికారత కోసం



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆమె వెంట జిల్లా సర్వే అధికారి గౌస్ బాషా, ఎంపీడీవో దేవసేన కుమారి, తహశీల్దార్ ఆంజనేయులు, ఇతర అధికారులు ఉన్నారు.

# అక్షరాల పేరిట లక్షల దోపిడి

**ముందస్తు అడ్మిషన్లతో తల్లిదండ్రులపై ఒత్తిడి..**

**ర్యాంకుల ముసుగులో ప్రైవేట్ విద్యా సంస్థల దందా..**

**గుర్తింపులేని ప్రైవేట్ విద్యా సంస్థలను సీజ్ చేస్తారా.?**

**నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు**

**ఎమ్మిగనూరు,మే12.అక్షర టైమ్స్ :** విద్య అనేది సేవగా ఉండాల్సిన వ్యవస్థ, అటువంటి వ్యవస్థను ప్రస్తుతం కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థల మాయాజాలంతో వ్యాపారంగా మారిపోతుందనే విమర్శలు ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు కర్నూలు జిల్లాలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్య ముసుగులో లక్షల రూపాయలు దోచుకుంటున్నాయన్న ఆరోపణలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న అక్రమ దోపిడిని అరికట్టాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా డిమాండ్ చేసింది. ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గఫూర్ పేర్కొన్నారు. మంగళవారం నాడు ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గఫూర్ అధ్యక్షతన నిర్వహించిన పట్టణ నాయకుల సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. సాబీర్ భాష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాబీర్ భాష మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ జీవో నెంబర్ 1కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేసి తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమాలను తీవ్రంగా ఖండించారు. ర్యాంకుల పేరుతో ఆకర్షణీయ ప్రకటనలు చేస్తూ




ముందస్తు అడ్మిషన్లు చేపట్టి విద్యను వ్యాపారంగా మార్చి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అడ్మిషన్ అంటే లక్షల ఖర్చే..!**

ముందస్తు అడ్మిషన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చేశారని షబీర్ భాష ఆవేదన వ్యక్తం చేశారు. ట్యూషన్ ఫీజుతో పాటు హాస్టల్, మెటీరియల్, ఇతర పేర్లతో అదనపు భారం మోపుతూ మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుదేలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

**గుర్తింపు లేకుండానే అడ్మిషన్లు..!**

ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ గుర్తింపు లేకుండానే అడ్మిషన్లు చేపడుతున్నాయని ఆయన వెల్లడించారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదకర పరిణామమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేసి, అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**ఇళ్లకు పిఆర్వోలు ఒత్తిడి పెంచుతున్న సంస్థలు...**

ప్రచారం కోసం పిఆర్వోలను విద్యార్థుల ఇళ్లకు పంపిస్తూ అడ్మిషన్ల కోసం ఒత్తిడి తెస్తున్నారని ఆయన తెలిపారు. ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు.

**నిద్ర మత్తులో విద్యాశాఖ...**

ఈ అక్రమాలు బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. పర్యవేక్షణ లోపం వల్లే ప్రైవేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

**ఏఐఎస్ఎఫ్ అల్టిమేటం:**


ప్రైవేట్ విద్యాసంస్థల పెరుగుతున్న వాణిజ్య ధోరణి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, లేదంటే అక్షరాల పేరుతో వ్యాపారం" అనే ముద్ర మరింత తీవ్రతరం దాల్చుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేని కాలేజీలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఆత్మ రక్షణ, క్రమశిక్షణ, ఏకాగ్రత కోసం కరాటే

**గిద్దలూరు,మే 12.అక్షర టైమ్స్ :** గిద్దలూరు లోని శ్రీ రాజ రాజేశ్వరి బిఈడి కాలేజీ లో కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్దిని, విద్యార్దులు కరాటే విద్యను అభ్యసిస్తునారు. కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం కరాటే నేర్చుకోవడంవల్ల విద్యార్థులు లలో క్రమశిక్షణ, ఆత్మరక్షణ, ఏకాగ్రత మంచి ఆరోగ్యం ఇంకా అనేక లాబాలు వున్నాయి అని చెప్పారు. బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నట్టు తెలియజేశారు. ఈ వేసవి సెలవులలో కరాటే తో పాటు కర్రసాము కూడా నేర్పిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేసవి లో ఉపయోగించు కో గలరు అని తెలియజేశారు.



## కాకినాడను అగ్రస్థానంలో నిలుపుదాం : కమిషనర్



**కాకినాడ,మే12 అక్షర టైమ్స్ :** స్వచ్ఛ సర్వేక్షణ్ లో కాకినాడను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని కమిషనర్ సత్యనారాయణ సూచించారు.మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో నగర శుభ్రత, వ్యర్థాల నిర్వహణపై సమీక్షించారు.ఈ సమావేశంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కళాశాలల ప్రిన్సిపల్స్, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. నగర పరిశుభ్రతకు అందరూ సహకరించాలని కోరారు.

## సేవా భావంతో సమాజానికి అండగా "హైదరాబాద్ సేవాదళ్"

### లయన్స్ క్లబ్ నూతన విభాగం ఆవిష్కరణ ఘనంగా





**కాప్రా,మే12.అక్షర టైమ్స్ :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లోని కమలానగర్ కాపు భవన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్ నూతన క్లబ్ ఏర్పాటు మరియు బాధ్యతల స్వీకార కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. సేవా కార్యక్రమాలను గ్రామాలు, పట్టణాల స్థాయిలో మరింత విస్తరించి ప్రజలకు చేరువ కావాలనే లక్ష్యంతో ఈ నూతన విభాగాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ అంతర్జాతీయ జిల్లా 320సీ జిల్లా గవర్నర్ కె. ఇన్నా రెడ్డి, ఎల్‌సీఐఎఫ్ సమన్వయకర్త కె. హరీష్ రెడ్డి, జిల్లా గవర్నర్ ఎన్నికైన కల్లెం కృష్ణారెడ్డి, మొదటి ఉప జిల్లా గవర్నర్ ఎన్నికైన డా. మండా సురేష్ కుమార్, రెండో ఉప జిల్లా గవర్నర్ ఎన్నికైన జి. శేఖర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. నూతన క్లబ్ ప్రారంభాన్ని అధికారికంగా ప్రకటించిన అతిథులు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు మాట్లాడుతూ సమాజంలో సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ ఎప్పటికప్పుడు ముందుండి పనిచేస్తోందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయ కార్యక్రమాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ నూతన సేవాదళ్ క్లబ్ కృషి చేయాలని సూచించారు. సేవా దృక్పథం కలిగిన యువత సమాజ మార్పుకు బలంగా నిలవాలని, ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల్లో సేవాస్ఫూర్తిని పెంపొందించాలని అతిథులు పిలుపునిచ్చారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రవి కుమార్ యాదవ్, సంపత్ గౌడ్, ఏవీఆర్ దత్తు, శ్యాంసుందర్, కృష్ణవేణి తదితర నాయకులు, సేవాదళ్ సభ్యులు, మహిళలు, యువకులు మరియు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## " హెల్మెట్ ధరించండి - ప్రాణాలను కాపాడుకోండి"



**కాకినాడ,మే12.అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్-1 పోలీసులు కాకినాడ కల్పనా సెంటర్ వద్ద"హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి:" అనే నినాదంతో వాహనదారులకు విస్తృత అవగాహన కల్పించారు. హెల్మెట్ మర్చిపోయిన వారిని ఇంటి వద్ద నుండి హెల్మెట్ తెప్పించుకుని హెల్మెట్ ధరించి వెళ్లేటట్లు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి 1,000 రూపాయల జరిమానా విధించడానికి బదులుగా, వారిచే కొత్త హెల్మెట్లు కొనిపించి, వాటిని ధరింపజేసి సురక్షితంగా పంపడం ద్వారా పోలీసులు వినూత్న రీతిలో స్పందించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, బైక్ స్టంట్స్ వంటి ప్రాణాపాయ చర్యలకు పాల్పడకూడదని ఈ సందర్భంగా హెచ్చరించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ వాడటం, అతివేగం మరియు అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, రెడ్ సిగ్నల్ పడినప్పుడు తప్పనిసరిగా స్టాప్ లైన్ వెనుక వాహనాలను ఆపాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా కాకినాడ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన



ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లగించిన వారిపై ఆటోమేటిక్ ఫైన్ జనరేషన్ సిస్టమ్ ద్వారా ఇ-చలానాలు నేరుగా జారీ చేయబడతాయని, సాంకేతికత పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. సదరు ట్రాఫిక్ కౌన్సిలింగ్ ద్వారా ఈరోజు సుమారు 20 మంది వాహనదారులు కొత్తగా హెల్మెట్లు కొనుగోలు చేసి, ధరించి వెళ్లారు. హెల్మెట్ ఇంటి వద్ద మరిచిపోయిన కొంతమంది వాహనదారులు ఇంటి వద్ద నుండి హెల్మెట్ తెప్పించుకుని తలకు ధరించి ద్విచక్ర వాహనం నడిపేటట్లు చేసినారు. ఇకపై రోడ్డు మీదకు బైక్ పై వస్తే హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణిస్తామని సిఐ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, ఎస్.ఐ పి. కిషోర్ కుమార్, టి.ఆర్.ఎస్.ఐ సత్యనారాయణ మరియు సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.

## రూల్స్ గాల్లోకి.. ఇళ్ల మధ్య రేడియేషన్ భూతమా?!

### అధికారులారా.. తక్షణమే 'స్టాప్-వర్క్' ఆర్డర్ ఇవ్వండి

### పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఊరుకోం

**పెన్ పహాడ్,మే12.అక్షర టైమ్స్ :** "మా ఇళ్ల మధ్య రేడియేషన్ భూతం వద్దు.. మా పిల్లలు, వృద్ధుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు!" అంటూ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సెల్ ఫోన్ సిగ్నల్ టవర్‌పై గ్రామ ప్రజలు రౌద్రరూపం దాల్చారు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, జనావాసాల మధ్య అడ్డగోలుగా చేపడుతున్న ఈ నిర్మాణం వల్ల తమ కుటుంబాలు తీవ్ర అనారోగ్యాల బారిన పడతాయని గ్రామస్తులు ఘాటుగా ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అత్యవసర విలేకరుల సమావేశంలో గ్రామ ప్రజలు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. కంపెనీల లాభాల కోసమేనా? ఈ అక్రమ,ప్రమాదకర



నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎండీవో ,గ్రామ పంచాయతీ రాతపూర్వకంగా ముక ్కంఠంతో దరఖాస్తులు సమర్పించారు. అయితే, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్నా అధికారులు ఇంకా మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటని, ప్రైవేట్ కంపెనీల లాభాల కోసమే ప్రజా ప్రాణాలను పణంగా పెడుతున్నారా అని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తక్షణమే పనులు ఆపాలి.. లేదంటే ప్రజా ఉద్యమం తప్పదు! నిబంధనల ప్రకారం నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాల్సిన టవర్‌ను ఇళ్ల మధ్య ఎలా అనుమతించారో స్థానిక యంత్రాంగం సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి తక్షణమే 'స్టాప్-వర్క్ నోటీసు' జారీ చేసి పనులను నిలిపివేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో గ్రామమంతా ఏకమై పెద్ద ఎత్తున రాస్తారోకోలు చేపడతామని, అవసరమైతే కలెక్టరేట్‌ను ముట్టడించి న్యాయం జరిగే వరకు పోరాడుతామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి విజయలక్ష్మి, సైదులు, షేక్.సైదులు, సన్నాయిల సాయి, జానీ బి, హుస్సేన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.జీ.ఆర్.ఐ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,మే12.అక్షర టైమ్స్ :** హనుమాన్ జయంతి సందర్భంగా న్ జిఆర్ఐ హబ్సిగూడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆశిస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజల పైయి ఉండాలని ఆకాంక్షించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమం లో ఈఓ వెంకన్న ,బజారు పాండ్డు గౌడ్ ,దేవాలయ కమిటీ సభ్యులు బికుమల్లా అంజయ్య గుప్తా ,ఈగ అంజనేయులు ,తుమ్మల దేవి రెడ్డి ,బుసం రఘునాథ్ రెడ్డి,వర్కాల మదన్ గౌడ్ ,కడప నర్సింగ్,కిషన్ నాయక్,సంతోష్ కుమార్,రవి శర్మ కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి ,రాజన్న,మాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మతనాన్ని గుర్తు చేసే నర్సుల సేవలు అభినందనీయం







**ఏ.ఎస్.రావు నగర్,మే12.అక్షర టైమ్స్ :** అనుపురం లోని తాత ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య రంగంలో నర్సులు అందిస్తున్న సేవలను అతిథులు ప్రత్యేకంగా ప్రశంసించారు. రోగికి వైద్య చికిత్స అందించే ప్రక్రియలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం గమనిస్తూ, సమయానికి మందులు అందించడం, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా స్పందించడం, వైద్యులకు సహకరించడం వంటి బాధ్యతలను నర్సులు ఎంతో అంకితభావంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ ధైర్యం చెప్పే గొప్ప మనసు నర్సులదేనని వక్తలు కొనియాడారు. కొన్నిసార్లు తమ వ్యక్తిగత జీవితాన్ని పక్కనబెట్టి రాత్రింబవళ్లు సేవలు అందిస్తూ మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నారని అన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన నర్సుల త్యాగం మరువలేనిదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్య కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఎన్. సత్యదేవ్, తాత ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ ఎన్. వాసుదేవ్, బ్యాంకు శాఖాధికారి, ఆసుపత్రి పరిపాలనాధికారి ఎన్. శ్రీనివాస నాయుడు, మాజీ ఈసీఐఎల్ ఉద్యోగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. నర్సులను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు.

## సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించిన కాకినాడ జిల్లా ఎస్పీ






**కాకినాడ,మే12.అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు 103 మంది పోలీసు సిబ్బందికి బదిలీల ప్రక్రియను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, చేపట్టారు. వారిలో 09 మంది ఏఎస్సైలు, 10 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 84 మంది కానిస్టేబుళ్లు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ అయ్యారు. వీరంతా ఒకే పోలీస్ స్టేషన్ లో 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని ఉన్నారు. బదిలీల ప్రక్రియలో వీలైనంత వరకు అందరికీ కోరుకున్న చోట పోస్టింగ్ కల్పించినందుకు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పీ కెవివి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎంవివి సత్యనారాయణ మూర్తి, సీసీ ఎస్ రాంబాబు,ఎ సెక్షన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్,ఎ1 సీనియర్ అసిస్టెంట్ పివిఎస్డి సుబ్రమణ్యం, ఎ2 ఎంఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ సమావేశంలో నేలపై కూర్చుని ఎమ్మెల్సీ నిరసన







**కాకినాడ,మే12.అక్షర టైమ్స్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశానికి మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరయ్యారు. ముగ్గురు ఎంపీ లు ఒక్కసారి కూడా రాకపోగా, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాత్రమే హాజరయ్యారు. అనపర్తి, కాకినాడ రూరల్, మండపేట, రాజనగరం ఎమ్మెల్యేలే వచ్చారు. ఎమ్మెల్సీ లు రాజశేఖర్, కర్రి పద్మశ్రీ రానేలేదు. కీలకమైన సమావేశానికి ఉన్నతాధికారులు సైతం రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. జడ్పీ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. కోనసీమ కలెక్టర్ గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, జెడ్పీటీసీలు నేలపై బైఠాయించారు. అధికారులు వేదికపై ఆసీనులవ్వగా, ప్రజాప్రతినిధులు కింద కూర్చోవడం చర్చనీయాంశమైంది. అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, తమను గౌరవించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్షర టైమ్స్

# మిగిలిపోయిన అన్నంతో చీజీ రైస్ బాల్స్ ఇలా చేస్తే ప్లేట్ ఖాళీ చేస్తార



వంటగదిలో మిగిలిపోయిన అన్నాన్ని వృథా చేయకుండా, రుచికరమైన చీజీ రైస్ బాల్స్‌గా మార్చే సులభమైన రెసిపీని తెలుసుకుందాం. ఈ వంటకం సాధారణ పదార్థాలతో తయారవుతుంది, సమయాన్ని ఆదా చేస్తుంది పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన స్నాక్‌గా నిలుస్తుంది. ఏడు సులభమైన స్టెప్స్ తో ఈ రెసిపీ తయారు చేయడం ఎంతో సులభం. అంతేకాదు ఆహార వృథాను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. ఈ రెసిపీని తయారు చేయడానికి మొదటగా వంటగదిలో మిగిలిపోయిన అన్నాన్ని సేకరించడం ముఖ్యం. ఇది సాదా అన్నం కావచ్చు లేదా కూరగాయలు కలిపిన అన్నం కావచ్చు. అన్నం కొంచెం పొడిగా ఉంటే, అది రైస్ బాల్స్ తయారీకి బాగా సరిపోతుంది. ఈ దశలో అన్నాన్ని ఒక పెద్ద గిన్నెలోకి తీసుకుని, దానిని చేతితో కొద్దిగా విరిచి మెత్తగా చేయాలి, తద్వారా ఇతర పదార్థాలతో కలపడం సులభమవుతుంది.

## రుచికరమైన పదార్థాలను జోడించడం

అన్నంలో రుచిని పెంచడానికి, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, క్యారెట్, బీన్స్ లేదా ఇతర కూరగాయలను జోడించాలి. ఈ కూరగాయలు మిశ్రమానికి క్రంచీ టెక్స్చర్‌ను అందిస్తాయి. అలాగే, కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి, మరియు గరం మసాలా వంటి సుగంధ ద్రవ్యాలు చల్లితే రుచి మరింత ఆకర్షణీయంగా మారుతుంది. ఈ దశలో అన్ని పదార్థాలను బాగా కలపడం ముఖ్యం, తద్వారా రుచి సమానంగా వ్యాపిస్తుంది.

## చీజ్‌తో రుచిని పెంచడం

ఈ రెసిపీకి ప్రత్యేక ఆకర్షణ చీజ్. మొజారెల్లా లేదా చెడ్డార్ చీజ్‌ను తురిమి అన్నం మిశ్రమంలో కలపాలి. చీజ్ రైస్ బాల్స్‌కు క్రీమీ టెక్స్చర్ మరియు రిచ్ రుచిని జోడిస్తుంది. చీజ్‌ను మిశ్రమంలో సమానంగా కలిపితే, బాల్స్ వేయించినప్పుడు లోపల మెత్తగా, బయట క్రిస్పీగా ఉంటాయి, ఇది స్నాక్‌ను మరింత ఆకర్షణీయంగా చేస్తుంది.

## మిశ్రమాన్ని బాల్స్ చుట్టడం

మిశ్రమం సిద్ధమైన తర్వాత, దానిని చిన్న చిన్న బాల్స్ గా చుట్టడం తదుపరి దశ. చేతులను కొద్దిగా నీటితో తడిచేసుకుంటే మిశ్రమం అంటుకోకుండా సులభంగా బాల్స్ గా చుట్టవచ్చు. బాల్స్ గా చిన్నగా ఉండేలా చూసుకోవాలి, తద్వారా అవి సమానంగా వేగుతాయి మరియు సర్వ్ చేయడానికి అనుకూలంగా ఉంటాయి. ఈ దశలో మిశ్రమాన్ని గట్టిగా నొక్కి ఆకారం ఇవ్వడం ముఖ్యం.

## బ్రెడ్‌క్రంబ్స్‌తో కోటింగ్ చేయడం

రైస్ బాల్స్‌ను క్రిస్పీగా మార్చడానికి, వాటిని బ్రెడ్‌క్రంబ్స్‌తో కోట్ చేయాలి. ముందుగా, బాల్స్ గా కొట్టిన గుడ్డు లేదా కార్న్‌ఫ్లోర్ మిశ్రమంలో ముంచి, ఆ తర్వాత బ్రెడ్‌క్రంబ్స్‌లో రోల్ చేయాలి. ఈ కోటింగ్ బంతులుగా గోల్డెన్ క్రస్ట్‌ను అందిస్తుంది మరియు వేయించినప్పుడు అదనపు క్రంచీనెస్‌ను జోడిస్తుంది.

## రైస్ బాల్స్‌ను వేయించడం

తయారుచేసిన రైస్ బాల్స్‌ను మీడియం వేడి నూనెలో లోతుగా వేయించాలి. నూనె చాలా వేడిగా ఉంటే బయట కాలిపోయే అవకాశం ఉంది, కాబట్టి వేడిని నియంత్రించడం ముఖ్యం. వీటిని జాగ్రత్తగా నూనెలో వేసి, అన్ని వైపులా గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చేవరకు వేయించాలి. వేగిన తర్వాత, వాటిని కాగితపు టవల్‌పై ఉంచి అదనపు నూనెను తొలగించాలి.

## సాస్‌తో సర్వ్ చేయడం

చీజీ రైస్ బాల్స్‌ను రుచికరమైన సాస్‌తో సర్వ్ చేయడం ఈ వంటకానికి అదనపు ఆకర్షణను జోడిస్తుంది. టమోటా కెచప్, మయోన్నైస్, లేదా స్పైసీ చట్నీ వంటి సాస్‌లు ఈ స్నాక్‌కు బాగా సరిపోతాయి. వేడిగా ఉన్న రైస్ బాల్స్‌ను సాస్‌తో ప్లేట్‌లో అందంగా అలంకరించి సాయంత్రం టీ సమయంలో లేదా పార్టీలలో సర్వ్ చేయవచ్చు, ఇది అందరినీ ఆకట్టుకుంటుంది.

# ఈ పండ్లు చిన్నగున్నా మీ చర్మాన్ని మాత్రం యవ్వనంగా ఉంచుతాయి



వేసవి కాలంలో చర్మం బాగా ప్రభావితమవుతుంది. ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల చర్మం పొడిబారిపోయి మంట వస్తుంది. కానీ సరైన ఆహారం తీసుకుంటే చర్మాన్ని చల్లబరచుకోవచ్చు. వేసవిలో శరీరం హైడ్రేట్ గా ఉండటం చాలా అవసరం. అలాంటి తేమ ఉండే ఆహారాలు తీసుకుంటే చర్మం మెరిసిపోతుంది. ఎండకు తట్టుకోగల శక్తి కూడా పెరుగుతుంది. పుచ్చకాయ వేసవిలో అత్యంత ముఖ్యమైన పండు. ఇది శరీరానికి తేమను అందిస్తుంది. ఇందులో విటమిన్-ఎ, బి, సి ఉంటాయి. ఇవి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. వేసవిలో ఎక్కువ చెమట వస్తుంది. అప్పుడు ఈ పండు తినడం వల్ల శరీరంలోని నీరు తగ్గకుండా ఉంటుంది. చర్మం పొడిబారకుండా ఉండి ఆరోగ్యంగా కనిపిస్తుంది. టమాటోలో లైకోపీన్ అనే ముఖ్యమైన పదార్థం ఉంటుంది. ఇది చర్మాన్ని ఎండ నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. రోజూ టమాటోను ఆహారంలో భాగంగా తీసుకుంటే చర్మం మెరుస్తూ ఉంటుంది. బయట తిరిగే వారు దీన్ని తప్పకుండా తీసుకోవాలి. ఇది సహజమైన సన్ స్క్రీన్ లా పని చేస్తుంది. పెరుగు తినడం వల్ల కడుపు శుద్ధి అవుతుంది. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ వల్ల గట్ కి మేలు కలుగుతుంది. ఇది శరీరంపై మంచి ప్రభావం చూపుతుంది. కడుపు శుద్ధి అవడం వల్ల చర్మం మీద కూడా ప్రకాశం కనిపిస్తుంది. వేసవిలో రోజూ పెరుగు తినడం వల్ల శరీరం చల్లగా ఉండి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. బెర్రీ పండ్లలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ అనే హానికర పదార్థాలను తగ్గిస్తాయి. చర్మాన్ని లోపల నుంచి రక్షిస్తాయి. ఇంకా ఈ పండ్ల వల్ల చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. కొల్లాజెన్ పెరగడం వల్ల చర్మం గట్టిగా మెరుస్తూ ఉంటుంది. యవ్వనంగా కనిపించడానికి బెర్రీలు సహాయపడతాయి. దోసకాయ తినడం వల్ల శరీరం చల్లబడుతుంది. ఇందులో సిలికా అనే పదార్థం ఉంటుంది. ఇది చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. వేసవిలో చర్మం మంటగా అనిపించొచ్చు. అలాంటి సమయంలో దోసకాయ తినడం వల్ల చర్మం ప్రకాశవంతంగా ఉంటుంది. ఇది శరీరానికి సహజ చల్లదనం ఇచ్చే ఆహారం. వేసవిలో సరైన ఆహారంతో పాటు శుద్ధమైన నీరు తాగడం కూడా అవసరం. ఎండలో ఎక్కువ సమయం గడపడం తగ్గించాలి. తేమ ఉండే ఆహారాలు, తాజా పండ్లు, కూరగాయలు తినాలి. ఇవి చర్మాన్ని లోపల నుంచి బలంగా ఉంచుతాయి.

# అవిసె గింజలు రోజూ తింటే ఆ వ్యాధి నయమవుతుందా వైద్యులు ఏమంటున్నారు



అవిసె గింజలు, ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన సూపర్‌ఫుడ్‌గా పిలుస్తారు. ఇవి మన ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, లిగ్నాన్స్ వంటి పోషకాలతో నిండిన ఈ గింజలు గుండె ఆరోగ్యం నుండి మధుమేహ నియంత్రణ వరకు అనేక విధాలుగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఈ గింజలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అవిసె గింజల ఆరోగ్య ప్రయోజనాలను వాటిని ఆహారంలో ఎలా చేర్చుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.. అవిసె గింజలు మధుమేహం ఉన్నవారికి గొప్ప ఆహార ఎంపికగా పనిచేస్తాయి. ఈ గింజల్లోని అధిక ఫైబర్ కంటెంట్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఫైబర్ ఆహారంలోని చక్కెర శోషణను నెమ్మదిస్తుంది, దీనివల్ల రక్త గ్లూకోస్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. కొన్ని పరిశోధనల ప్రకారం, రోజూ 10 గ్రాముల అవిసె గింజల పొడిని తీసుకోవడం వల్ల టైప్-2 మధుమేహం ఉన్నవారిలో ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. ఈ గింజలు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి, ఇది మధుమేహ నిర్వహణలో కీలకం.

## గుండె ఆరోగ్యానికి మేలు

అవిసె గింజల్లో ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లం రూపంలో పుష్కలంగా ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఈ గింజలు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. రోజూ అవిసె గింజలను తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి, ముఖ్యంగా ప్రీ-డయాబెటిక్ రోగులలో సిస్టోలిక్ రక్తపోటు గణనీయంగా తగ్గుతుంది. ఈ గింజల్లోని లిగ్నాన్స్ మరియు ఫైబర్ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి, ఇవి గుండె సంబంధిత సమస్యల నివారణకు సహజమైన మార్గంగా పనిచేస్తాయి.

## జీర్ణక్రియ బరువు నియంత్రణ

అవిసె గింజల్లో ద్రావణీయ మరియు ద్రావణీయం కాని ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. ఈ ఫైబర్ ఆకలిని నియంత్రిస్తూ ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారికి అవిసె గింజలు ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీర బరువు మరియు బాడీ మాస్ ఇండెక్స్ తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ గింజలు జీవక్రియను మెరుగుపరచడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తాయి.

## క్యాన్సర్ నివారణలో సహాయం

అవిసె గింజల్లో లిగ్నాన్స్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడంలో ఈ గింజలు సహాయపడతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. లిగ్నాన్స్ కణాల మరణాన్ని ప్రేరేపిస్తాయి మరియు గడ్డలకు రక్త సరఫరాను తగ్గిస్తాయి, ఇది క్యాన్సర్ వ్యాప్తిని నిరోధిస్తుంది. అవిసె గింజలను రోజూ తీసుకోవడం వల్ల క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే కీమోథెరపీ మందుల సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది.

## చర్మం జుట్టు ఆరోగ్యం

అవిసె గింజల్లోని ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు మరియు యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఈ గింజలు చర్మంలో తేమను నిలుపుకోవడం, చర్మం యొక్క ఒరిగిపోవడం మరియు సున్నితత్వాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తాయి. అవిసె గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గాయాలు త్వరగా నయం అవుతాయి మరియు చర్మం సహజమైన గ్లోను పొందుతుంది. అదే విధంగా, ఈ గింజల్లోని పోషకాలు జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి, జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి మరియు జుట్టును బలంగా మారుస్తాయి.

## ఎలా తీసుకోవాలి?

అవిసె గింజల పూర్తి ప్రయోజనాలను పొందడానికి, వాటిని సరైన రూపంలో తీసుకోవడం ముఖ్యం. మొత్తం గింజలు జీర్ణం కావడం కష్టం కాబట్టి, వాటిని పొడి చేసి తీసుకోవడం ఉత్తమం. ఈ పొడిని స్మూతీలు, పెరుగు, సలాడ్‌లు లేదా చపాతీ పిండిలో కలిపి తీసుకోవచ్చు. రోజుకు 1-2 టీస్పూన్ల అవిసె గింజల పొడి తీసుకోవడం సురక్షితం మరియు ప్రయోజనకరం. అయితే, మధుమేహ మందులు తీసుకునే వారు లేదా రక్తపోటు సమస్యలు ఉన్నవారు ఈ గింజలను ఆహారంలో చేర్చే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది, ఎందుకంటే అవిసె గింజలు కొన్ని మందులతో సంకర్షణ చెందవచ్చు

# అందగత్తెల ఆనందం కోసం అదిరిపోయే లుక్ కొత్తరూపు దిద్దుకున్న చారిత్రక నిర్మాణాలు




మిస్ వరల్డ్ పోటీలకు తొలిసారి తెలంగాణ ఆతిథ్య మిస్తుంది.. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న విశ్వ వ్యాప్త అందగత్తెలు తెలంగాణలోని వివిధ ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించనున్నారు.. రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన యునెస్కో గుర్తింపుపొందిన నిర్మాణం రామప్ప, వేయి స్తంభాలగుడి ఖిలా వరంగల్ సందర్శనకు వస్తుండడంతో అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. ఆ చారిత్రక నిర్మాణాలను చూసి సుందరీమణులు వాహ్ అనిపించేలా కొత్త రూపుదిద్దుకున్నాయి.. విద్యుత్ దీపాల కాంతులతో వెలిగిపోతున్నాయి.. అందగత్తలను మించిన అందంతో మురిసిపోతున్న ఆ చారిత్రక నిర్మాణాలు ఎలా దగదగలాడుతున్నాయో ఓ లుక్కేయండి మిస్ వరల్డ్ పోటీలకు తొలిసారి తెలంగాణ గడ్డ వేదిక అయింది.. హైదరాబాద్ మహానగరం ఇప్పటికే విశ్వసుందరులను అబ్బురపరిచేలా కొత్త రూపుదిద్దుతుంది..ఆతిథ్యం అదరహో అనిపించింది.. ఇక ఆ సుందరిమణులు తెలంగాణ లోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు రూట్ మ్యాప్ రెడీ అవ్వడంతో అక్కడ చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి సుందరీమణుల రాక కోసం సర్వం సిద్ధమైంది..14 వ తేదీన 116 దేశాలకు చెందిన అందబామలు ఓరుగల్లు కు రాబోతున్నారు.. కాకతీయ వాసరత్వ సంపద వేయి స్తంభాలగుడి, రామప్ప, కిలా వరంగల్ పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తారు..

## వేసవిలో పూల్ మఖానాని ఇలా తింటే బోలెడన్నీ బెనిఫిట్స్..!

వారికి ఘనస్వాగతం పలికి అబ్బురపోయేలా ఏర్పాట్లు చేస్తున్నారు..భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. ఖిలా వరంగల్ కోట, రామప్ప, వేయి స్తంభాలగుడి విద్యుత్ దీపాల కాంతులతో వెలిగి పోతున్నాయి.. ఖిలా వరంగల్ కోట లో సౌండ్స్ అండ్ లైటింగ్ షో ఏర్పాటు చేశారు. 116 దేశాలకు చెందిన అందమైనబామలు ప్రత్యేక వాహనాలలో 14 వ తేదీ సాయంత్రం హనుమకొండ కు చేరుకుంటారు..హనుమకొండ హరిత కాకతీయ హొటల్ లో కొంతసేపు విశ్రాంతి తీసుకొని అక్కడి సాయంత్రం 5 గంటలకు రెండు బృందాలుగా విడిపోతారు.. ఒక గ్రూప్ యూనిస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సందర్శకు వెళ్తుంది.. మరో గ్రూప్ వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్ కోట సందర్శిస్తారు.. సుందరిమణులు సందర్శించిన పర్యాటక ప్రదేశాలన్నీ ఇప్పుడు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.. ప్రత్యేక మెనూ తో వంటకాలను రెడీ చేస్తున్నారు.. మరోవైపు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు..

# మామిడి పండు తొక్కలో షాకింగ్ బెనిఫిట్స్ దీంతో ఏమేం చేయొచ్చో తెలిస్తే ఇంకెప్పుడూ పడేయరు



వేసవిలో దొరికే మ్యాజికల్ ఫ్రూట్ ఏది అంటే మామిడి పళ్లే అంటారు. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం ఇవ్వడమే కాకుండా దీని వల్ల ఇంకా ఎన్నో ప్రయోజనాలున్నాయి. మామిడి పండు తినేసి తొక్కను పడేస్తుంటాం. కానీ, తొక్కతో కూడా కొన్ని రుచికరమైన రెసిపీలను తయారు చేయొచ్చు. దీని రుచి పండు రేంజ్ కు ఏమాత్రం తీసిపోదు. అవేంటో చూద్దాం.. మామిడి సీజన్‌లో మనం ఎక్కువగా పండు గుజ్జును ఆస్వాదిస్తాం, కానీ తొక్కలను విసిరేస్తాం. అయితే, ఈ మామిడి తొక్కలతో రుచికరమైన సృజనాత్మక వంటకాలను తయారు చేయడానికి ఏడు సులభమైన రెసిపీలను పరిచయం చేస్తుంది. చట్నీలు, జామ్‌లు, రిఫ్రెషింగ్ డ్రింక్స్ మరియు స్వీట్‌ల వరకు, ఈ రెసిపీలు వంటగదిలో సమయాన్ని ఆదా చేస్తూ కొత్త రుచులను అందిస్తాయి. ఈ వంటకాలు సాధారణ పదార్థాలతో తయారవుతాయి, ఆరోగ్యానికి మేలు చేస్తాయి ఆహార వృథాను తగ్గిస్తాయి.

## మామిడి తొక్క చట్నీ

మామిడి తొక్కలతో స్పైసీ చట్నీ తయారు చేయడం ఒక అద్భుతమైన ఆలోచన. తొక్కలను చిన్న ముక్కలుగా కట్ చేసి, వెల్లుల్లి, ఆవాలు, ఎండుమిర్చి, కొద్దిగా చక్కెరతో కలిపి వేడి నూనెలో వేయించితే రుచికరమైన చట్నీ సిద్ధమవుతుంది. ఈ చట్నీ అన్నం, ఇడ్లీ, దోసెలతో సర్వింగ్ చేయడానికి అనువైనది మరియు తొక్కల్లోని ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది.

## మామిడి తొక్క జామ్

మామిడి తొక్కలను ఉపయోగించి తీపి జామ్ తయారు చేయడం మరొక సులభమైన రెసిపీ. తొక్కలను బాగా కడిగి, మెత్తగా గ్రైండ్ చేసి, చక్కెర, నిమ్మరసంతో కలిపి మందమైన అంటున ఉడికించాలి. ఈ జామ్ రొట్టె, చపాతీ లేదా టోస్ట్‌పై స్ప్రెడ్ చేసి ఆస్వాదించవచ్చు. ఇది తొక్కల్లోని విటమిన్ సి యాంటీఆక్సిడెంట్లను సంరక్షిస్తూ రుచిని అందిస్తుంది.

## మామిడి తొక్క టీ

మామిడి తొక్కలతో రిఫ్రెషింగ్ టీ తయారు చేయడం ఆరోగ్యానికి మేలు చేసే ఆలోచన. తొక్కలను ఎండబెట్టి, మెత్తగా పొడి చేసి, వేడి నీటిలో వేసి కాసేపు ఉడకనివ్వాలి. ఈ టీకి కొద్దిగా తేనె లేదా చక్కెర జోడించి సిప్ చేయవచ్చు. ఈ హెర్బల్ టీ శరీరంలోని విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

## మామిడి తొక్క పచ్చడి

మామిడి తొక్కలతో సాంప్రదాయ పచ్చళ్లు తయారు చేయడం ఆహార ప్రియులకు అద్భుతమైన ఎంపిక. తొక్కలను చిన్న ముక్కలుగా కట్ చేసి, ఆవాలు పొడి, ఉప్పు, మిరప పొడి, నూనెతో కలిపి కొన్ని రోజులు ఎండలో ఉంచితే రుచికరమైన అచార్ సిద్ధమవుతుంది. ఈ అచార్ భోజనానికి అదనపు రుచిని జోడిస్తుంది మరియు ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

## మామిడి తొక్క స్మూతీ

మామిడి తొక్కలతో ఆరోగ్యకరమైన స్మూతీ తయారు చేయడం సులభమైన రిఫ్రెషింగ్ రెసిపీ. తొక్కలను బాగా కడిగి, పెరుగు, తేనె, మరియు ఇతర పండ్లతో కలిపి బ్లెండ్ చేయాలి. ఈ స్మూతీ విటమిన్లు మరియు ఫైబర్‌తో నిండి ఉంటుంది, ఉదయం లేదా సాయంత్రం స్నాక్‌గా ఆదర్శంగా ఉంటుంది.

## మామిడి తొక్క క్యాండీ

మామిడి తొక్కలతో తీపి క్యాండీ తయారు చేయడం పిల్లలు మరియు పెద్దలకు ఇష్టమైన ట్రీట్. తొక్కలను సన్నగా కట్ చేసి, చక్కెర సిరప్‌లో ఉడికించి, ఎండబెట్టాలి. ఈ క్యాండీ సహజమైన తీపిని అందిస్తుంది మరియు ఆరోగ్యకరమైన స్నాక్‌గా ఉపయోగపడుతుంది.

# షుగర్ ఉన్నవారు రోజూ కొబ్బరి నీళ్లు తాగితే ఏమౌతుందో తెలుసా



కొబ్బరి నీళ్లు శరీరానికి శక్తిని అందించే ప్రకృతిసిద్ధమైన డ్రింక్. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్స్, కరిగే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడతాయి. వేసవి కాలంలో లేదా శ్రమ ఎక్కువగా చేసినప్పుడు కొబ్బరి నీళ్లు తాగితే శరీరానికి ఉత్సాహం లభిస్తుంది. అయితే మధుమేహం ఉన్నవారికి ఇది పూర్తిగా మంచిదా..? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. కొబ్బరి నీళ్లలో సహజంగా ఉండే ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి చక్కెర పదార్థాల ప్రభావం మీద శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుంది. ఎందుకంటే కొబ్బరి నీళ్లు తాగిన కొద్దిసేపటికే రక్తంలో చక్కెర స్థాయి కొంత మేర పెరిగే అవకాశం ఉంటుంది. కొబ్బరి నీటిలో తక్కువ కేలరీలు ఉన్నా.. ఒక్క కప్పు అంటే సుమారుగా 240 మిల్లీలీటర్లలో 6 నుంచి 7 గ్రాముల వరకు సహజ చక్కెరలు ఉండే అవకాశం ఉంటుంది. అయితే దీని గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా కాకుండా.. తక్కువ వేగంతో పెంచుతుంది. ఇదే కారణంగా కొబ్బరి నీటిని మితంగా తీసుకుంటే మధుమేహం ఉన్నవారికి పెద్ద హానీ కలగదు. మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీళ్లను పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు. కానీ మితంగా తీసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా వ్యాయామం చేసిన తర్వాత లేదా శరీరం నీటిని కోల్పోయినప్పుడు కొబ్బరి నీళ్లను తీసుకుంటే అది శక్తిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే పొటాషియం రక్తపోటు నియంత్రణలో సహాయపడుతుంది. దీనివల్ల హృదయ ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలో ఉన్న హానికరమైన మూలకాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఉపయోగపడుతుంది. కానీ మధుమేహం ఉన్నవారు దీన్ని రోజూ అధిక పరిమాణంలో తీసుకుంటే మాత్రం రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే దీనిని నియంత్రిత పరిమాణంలో అవసరమైన సందర్భాల్లో మాత్రమే తీసుకోవాలి. కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివే.. అయితే మధుమేహం ఉన్నవారు దీన్ని తీసుకునేటప్పుడు ఆలోచించి, మితంగా, శరీర పరిస్థితులను గమనిస్తూ తీసుకుంటే మంచిది

# ఇవి మీ ఇంట్లో ఉంటే అదృష్టం మీ వెంటే ఇక తిరుగులేదు డబ్బే డబ్బు



ఇంట్లో చేపల్ని పెంచే అలవాటు చాలా మందిలో ఉంటుంది. ముఖ్యంగా అక్వేరియంలో రంగు రంగుల చేపలు ఉండటం చూడటానికి బాగుంటుంది. కానీ కొన్ని ప్రత్యేకమైన చేపలు ఉంటే అదృష్టం కూడా కలిసివస్తుందని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందాం. డ్రాగన్ ఫిష్ ఇంట్లో పెంచితే మంచి ఫలితాలు వస్తాయని నమ్మకం ఉంది. వాస్తు ప్రకారం ఈ చేప సంపదను ఆకర్షిస్తుందని చెబుతారు. దాంతో పాటు ఇంట్లో శ్రేయస్సు పెరుగుతుంది. గోల్డ్ ఫిష్ ఉండటం వల్ల ఇంట్లో ప్రశాంతత వస్తుంది. అదృష్టం కూడా కలుగుతుంది. దీని వల్ల ధనసంపత్తి పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు రావు అని కూడా అంటున్నారు. బ్లాక్ మూర్ గోల్డ్ ఫిష్.. ఇది ఇంట్లో ఉన్నప్పుడు పాజిటివ్ ఎనర్జీ పెరుగుతుంది. చెడు దృష్టి ప్రభావం తగ్గుతుంది. ప్రశాంతతతో పాటు ఇంట్లో మంచి వాతావరణం ఏర్పడుతుంది. అదృష్టం కలగడం సహజమే అని అంటున్నారు. కోయ్ ఫిష్ ఇంట్లో పెంచితే అదృష్టం వస్తుందని నమ్మకం ఉంది. ఇది పాజిటివ్ శక్తిని తీసుకురాగలదు. ఈ చేప ధన లాభానికి తోడ్పడుతుంది. ఇల్లు ఆనందంగా మారుతుంది. ఫ్లవర్ హార్న్ ఫిష్.. ఈ చేపల్ని ఇంట్లో పెంచితే అదృష్టం చేకూరుతుంది. ఫెంగ్ షుయ్ లో కూడా ఈ చేపలను మంచి సంకేతంగా చెబుతారు. ఇది ఇంటికి శాంతిని తీసుకురాగలదు. మొల్లిస్ చేపలు.. నలుపు రంగు లేదా సిల్వర్ రంగులో ఉండే మొల్లిస్ చేపలు ఇంట్లో ఉన్నప్పుడు సానుకూల శక్తి చుట్టూ వ్యాపిస్తుంది. ఇంట్లో నిండుగా శుభ వాతావరణం ఏర్పడుతుంది. ఆర్థిక సమస్యలు తగ్గుతాయని చెబుతారు. ఏంజెల్ చేపలు ఇంట్లో ఉంటే మంచి అందం వస్తుంది. ఇంకా ప్రశాంతంగా అనిపిస్తుంది. అదృష్టం కూడా వస్తుందంటారు. వీటిని ఇంట్లో ఉంచితే వాతావరణం కూడా కూల్‌గా ఉంటుందట. బెట్టా ఫిష్ చాలా అందంగా కనిపిస్తాయి. ఈ చేప ధైర్యానికి ప్రతీకగా చెప్పబడుతుంది. ఇంట్లో ఉండటం వల్ల ధైర్యంగా ఉండే శక్తి పెరుగుతుంది. అదృష్టం కూడా వెంట పడుతుంది. సానుకూలత చుట్టూ ఏర్పడుతుంది. ఇలాంటి చేపలను ఇంట్లో పెంచితే మనసుకు శాంతి, డబ్బు లాభం, అదృష్టం కలుగుతాయని చాలా మంది నమ్ముతారు. కానీ వాటిని బాగా చూసుకోవాలి. వాటికి కావలసిన శుభ్రత, తిండి పెట్టాలి. అప్పుడే ఆ మంచి ఫలితాలు నిజంగా వస్తాయి.

అక్షర టైమ్స్

# బంగారం ధరలకు కొత్త సవాల్

## బిట్ కాయిన్ ఈటీఎఫ్‌ల ముందు వేస్ట్ అంటున్న నిపుణులు

### కారణం ఏంటంటే

బ్లూమ్‌బెర్గ్ ఇంటెలిజెన్స్ విశ్లేషకులు ఆర్థిక మార్కెట్లలో ఒక చారిత్రాత్మక మార్పును అంచనా వేస్తున్నారు. రాబోయే కాలంలో ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్ విభాగంలో నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల పరంగా బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌లు.. సాంప్రదాయ గోల్డ్ ఈటీఎఫ్‌లను అధిగమిస్తాయని ప్రముఖ విశ్లేషకుడు జేమ్స్ సెఫార్ట్ పేర్కొన్నారు. పెట్టుబడిదారుల ప్రవర్తనలో వస్తున్న మార్పులు, ఆధునిక పోర్ట్‌ఫోలియోలలో డిజిటల్ ఆస్తుల ప్రాధాన్యత పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు.బంగారం దశాబ్దాలుగా సురక్షితమైన పెట్టుబడిగా, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా ఒక రక్షణ కవచంగా గుర్తింపు పొందింది. అయితే బంగారం ఆకర్షణ కేవలం ఈ ఒక్క 'విలువ నిధి' అనే సిద్ధాంతంపైనే ఆధారపడి ఉండగా, బిట్‌కాయిన్ మాత్రం పెట్టుబడిదారులకు బహుముఖ ప్రయోజనాలను అందిస్తోంది. దీనిని కేవలం డిజిటల్ బంగారంగానే కాకుండా, ఒక సాంకేతిక వృద్ధి ఆస్తిగా, ఇతర ఆస్తులతో తక్కువ సహసంబంధం కలిగిన పోర్ట్‌ఫోలియో వైవిధ్యకారిగా కూడా పరిగణిస్తున్నారు.మార్చి 2025 నాటి గణాంకాలు ఈ మార్పును మరింత స్పష్టం చేస్తున్నాయి. ఆ నెలలో యూఎస్ గోల్డ్ ఈటీఎఫ్‌ల నుండి పెట్టుబడిదారులు సుమారు 2.92 బిలియన్ డాలర్లను ఉపసంహరించుకోగా, అదే సమయంలో కొత్తగా వచ్చిన స్పాట్ బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌లలోకి 1.32 బిలియన్ డాలర్ల నికర పెట్టుబడులు వచ్చాయి.బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ, పెట్టుబడిదారులు అధిక వృద్ధి కోసం డిజిటల్ ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారని ఈ వ్యత్యాసం నిరూపిస్తోంది. బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌లు ఈటీఎఫ్‌లను అధిగమించడానికి ప్రధానంగా యువతరం ఆలోచనా ధోరణి తోడ్పడుతోంది. వీరు భౌతిక బంగారం కంటే డిజిటల్ ఆస్తులను ఎక్కువగా విశ్వసిస్తుండటంతో, రాబోయే దశాబ్దాల్లో పెద్ద ఎత్తున నిధులు బిట్‌కాయిన్ వైపు మళ్ళే అవకాశం ఉంది.బంగారం ధర ఈ వారం ఎంత పెరిగిందో తెలుసా.. రూపాయి పైనే పెట్టుబడిదారుల ఆశలు.. ఎందుకంటే.బంగారం ధర ఈ వారం ఎంత పెరిగిందో తెలుసా.. రూపాయి పైనే పెట్టుబడిదారుల ఆశలు.. ఎందుకంటే..నియంత్రణపరమైన పరిణామాలు కూడా ఈ వృద్ధికి కీలకమైన మలుపుగా నిలిచాయి. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ నుండి స్పాట్ బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌లకు లభించిన ఆమోదం, సంస్థాగత పెట్టుబడిదారులకు ఉన్న ప్రధాన అడ్డంకిని తొలగించింది. భౌతిక బంగారంతో పోలిస్తే బిట్‌కాయిన్‌ను బదిలీ చేయడం, భద్రపరచడం, విభజించడం చాలా సులభం కావడం మరో అదనపు బలం.కొంతమంది నిపుణులు 2026 నాటికి బంగారం ధరలు పుంజుకుంటాయని అంచనా వేస్తున్నప్పటికీ, ఆ సమయంలో కూడా బిట్‌కాయిన్ మెరుగైన పనితీరును కనబరచగలదని



విశ్లేషకులు భావిస్తున్నారు. బంగారం ధర పెరగడం వల్ల కలిగే చర్చ సహజంగానే బిట్‌కాయిన్ వైపు కూడా దృష్టిని మళ్ళిస్తుంది.ఆధునిక ఆర్థిక వ్యవస్థలో పోర్ట్‌ఫోలియో నిర్మాణం మారుతున్న తరుణంలో, ఒకప్పుడు కేవలం మాత్రమే పోషించిన వైవిధ్యీకరణ పాత్రను ఇప్పుడు బిట్‌కాయిన్ కూడా పంచుకుంటోంది. గోల్డ్ ఈటీఎఫ్‌లు ఇంకా భారీ మార్కెట్ వాటాను కలిగి ఉన్నప్పటికీ, బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌ల వృద్ధి వేగం చూస్తుంటే ఆర్థిక ప్రపంచంలో ఒక కొత్త శకం మొదలైందని స్పష్టమవుతోంది.ఈ మార్పు కేవలం ఒక ధోరణి మాత్రమే కాదు, ఇది పెట్టుబడి ప్రపంచంలో వస్తున్న ప్రాథమిక మార్పుకు ఒక బలమైన సంకేతం. తక్కువ సహసంబంధం ఉన్న ఆస్తులను చేర్చుకోవడం ద్వారా రిస్క్ తగ్గించుకోవాలనుకునే పెట్టుబడిదారులకు బిట్‌కాయిన్ ఇప్పుడు ఒక అనివార్యమైన ఎంపికగా మారుతోంది.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి.

# కొత్త లేబర్ కోడ్స్.. గ్రాట్యుటీ అర్హతలో భారీ మార్పులు


### 5 ఏళ్లకు బదులుగా ఏడాదికే

భారతదేశంలో కార్మిక సంక్షేమ దిశగా ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. నవంబర్ 2025లో అమలులోకి వచ్చిన కొత్త కార్మిక చట్టాలు గ్రాట్యుటీ నిబంధనలలో సమూల మార్పులను తీసుకువచ్చాయి. గతంలో ఒక ఉద్యోగి గ్రాట్యుటీ పొందాలంటే కనీసం ఐదేళ్ల నిరంతర సేవ తప్పనిసరిగా ఉండాలి అనే నిబంధన ఉండేది, కానీ కొత్త మార్పుల ప్రకారం ఇప్పుడు కేవలం ఒక సంవత్సరం తర్వాతే ఈ ప్రయోజనాన్ని పొందే అవకాశం కలిగింది.సాధారణంగా గ్రాట్యుటీ అనేది ఒక ఉద్యోగి ఒక సంస్థకు అందించిన దీర్ఘకాలిక సేవలకు గుర్తింపుగా, పదవీ విరమణ సమయంలో లేదా ఉద్యోగం వదిలివేసేటప్పుడు యజమాని ఇచ్చే ఆర్థిక బహుమతి. చట్టం ప్రకారం, పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులున్న ప్రతి సంస్థ తన అర్హులైన ఉద్యోగులకు ఈ మొత్తాన్ని చెల్లించడం తప్పనిసరి.ఈ కొత్త నిబంధనలు నవంబర్ 21, 2025 నుండి అధికారికంగా అమలులోకి వచ్చాయి. ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసిన ప్రకారం, ఈ తేదీ తర్వాత కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు మాత్రమే ఒక సంవత్సరం నిబంధన వర్తిస్తుంది. అయితే, ఈ ఒక సంవత్సరం గ్రాట్యుటీ సౌకర్యం ఉద్యోగులందరికీ ఒకేలా వర్తించదు. ప్రధానంగా నిర్ణీత కాలం పని చేసేవారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈ మార్పు పెద్ద ఊరటనిస్తుంది.ఒక రాతపూర్వక ఒప్పందం ప్రకారం నిర్దిష్ట కాలం పాటు పనిచేసే వీరికి, వారు పనిచేసిన కాలానికి అనుగుణంగా అంటే దామాషా పద్ధతిలో గ్రాట్యుటీని లెక్కిస్తారు. కానీ, రెగ్యులర్ లేదా శాశ్వత ఉద్యోగులు గ్రాట్యుటీ క్లెయిమ్ చేయాలంటే ఇప్పటికీ సాధారణంగా ఐదేళ్ల సేవ పూర్తి చేయాల్సి ఉంటుంది. కేవలం ఉద్యోగి మరణించినా లేదా వైకల్యానికి గురైనా మాత్రమే ఈ ఐదేళ్ల నిబంధన నుండి మినహాయింపు ఉంటుంది. గ్రాట్యుటీ రూల్స్‌లో బిగ్ చేంజ్.. ఏడాది సర్వీస్‌కే డబ్బులు.. కానీ, ఆ కండిషన్ తప్పనిసరి! గ్రాట్యుటీ రూల్స్‌లో బిగ్ చేంజ్.. ఏడాది సర్వీస్‌కే డబ్బులు.. కానీ, ఆ కండిషన్ తప్పనిసరి!గ్రాట్యుటీ లెక్కింపు విధానంలో కూడా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. కొత్త చట్టం ప్రకారం.. గ్రాట్యుటీ అనేది ఉద్యోగి యొక్క 'వేతనం'పై ఆధారపడి ఉంటుంది. ఇక్కడ వేతనం అంటే కేవలం బేసిక్ పే మాత్రమే కాకుండా, మూల వేతనం, కరువు భత్యం , రిటైనింగ్ అలవెన్స్‌ల కలయికగా




పరిగణిస్తారు. ముఖ్యంగా, ఒక ఉద్యోగి యొక్క మొత్తం జీతం లో ఈ వేతనం కనీసం 50 శాతం ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.దీనివల్ల గతంలో తక్కువ బేసిక్ పే ఉండి, ఇతర భత్యాలు ఎక్కువగా పొందిన ఉద్యోగులకు ఇప్పుడు అందే మొత్తం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ సంస్కరణలు లక్షలాది మంది అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతను కల్పించడమే కాకుండా, వారి పదవీ విరమణానంతర జీవితానికి ఆర్థిక భరోసానిస్తాయి.


# బెంగళూరులో బతకాలంటే నెలకి రూ. రూ. 1.3 లక్షలు కావాలి



కుటుంబం ఖర్చుపై సోషల్ మీడియాలో హాట్ డిబేట్.. బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయం పై ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చకు దారి తీస్తోంది. రాధిక, ఏకాంశ్ అనే జంట పంచుకున్న వివరాలు ఒక ప్రధాన ఉదాహరణగా నిలిచాయి. పూర్తిస్థాయి ఉద్యోగాలతో పాటు కంటెంట్ క్రియేటర్లుగా రాణిస్తున్న ఈ జంట, విహారయాత్రలు లేదా విలాసవంతమైన ఖర్చులు కాకుండా కేవలం ప్రాథమిక జీవనశైలి కోసమే ప్రతి నెలా సుమారు రూ. 1.3 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భారతదేశపు ఐటీ రాజధానిలో మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాల ఆర్థిక స్థితిగతులను ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ దంపతుల బడ్జెట్‌లో సింహభాగం ఇంటి అద్దెకే వెళ్తోంది. నెలకు రూ. 56,000 అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపిన వారు, ఈ మొత్తాన్ని 'రెండవ ఈఎంఐ'తో పోల్చడం గమనార్హం. ఐటీ నిపుణులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయనే వాస్తవానికి ఇది నిదర్శనం. ఉద్యోగ బాధ్యతల వల్ల ఇంటి పనుల కోసం వారు మరో రూ. 10,000 కేటాయిస్తున్నారు. ఇక నిత్యావసరాలైన కిరాణా సామాగ్రికి రూ. 15,000, విద్యుత్, ఇంటర్నెట్ వంటి యుటిలిటీ సేవల కోసం మరో రూ. 15,000 ఖర్చవుతోంది. రవాణా ఖర్చులు, పెట్రోల్ వంటి వాటి కోసం నెలకు రూ. 6,000 వినియోగిస్తున్నారు. కేవలం అవసరాలకే కాకుండా, ఆధునిక నగర జీవనంలో భాగంగా మారిన ఇతర ఖర్చులు కూడా వీరి బడ్జెట్‌లో గణనీయంగా ఉన్నాయి. బయట భోజనం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీల కోసం రూ. 10,000, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్ల కోసం రూ. 3,000 ఖర్చు చేస్తున్నారు. వీటితో పాటు షాపింగ్, ఇతర అనుకోని ఖర్చుల కోసం నెలకు మరో రూ. 15,000 పక్కన పెడుతున్నారు. విమాన ప్రయాణాలు లేదా సెలవుల ఖర్చులు కలపకుండానే నెలకు రూ. 1.3 లక్షలు అవ్వడం గమనార్హం.ఎంత సంపాదించినా నెల ఆఖరికి డబ్బులు మిగలడం లేదు అన్న వారి వ్యాఖ్య నగరవాసుల మానసిక స్థితిని తెలియజేస్తోంది. రూ. 70 లక్షల ప్యాకేజీ.. కానీ సేవింగ్స్ సున్నా! వైరల్ అవుతున్న శాలరీ బ్రేకప్! ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు విభిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు వినియోగదారులు ఈ ఖర్చులను తీవ్రంగా విమర్శించారు. అధిక అద్దె ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవడం వారి వ్యక్తిగత నిర్ణయమని, దీవఅస్త్రుఖ్రీబతీబ లో తక్కువ ఖర్చుతో కూడా జీవించవచ్చని వారు వాదించారు. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబాలు కూడా ఇంతకంటే తక్కువ ఖర్చుతో నెట్టుకొస్తున్నారని మరికొందరు గుర్తుచేశారు. అయితే, మరో వర్గం ప్రజలు ఈ జంటను సమర్థించారు. సౌకర్యవంతమైన, నాణ్యమైన జీవనశైలిని కోరుకునే వారికి బెంగళూరు వంటి నగరాల్లో ఇవి కనీస ఖర్చులేనని వారు అభిప్రాయపడ్డారు. ఇతర నగరాలతో పోలిస్తే ఇక్కడ నివాస వ్యయం చాలా ఎక్కువగా ఉందని, ఒక మంచి నగరంలో లభించే అవకాశాలకు మనం చెల్లించాల్సిన మూల్యం ఇదేనని పలువురు వ్యాఖ్యానించారు. ఈ చర్చ ద్వారా నగరాల్లో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, మారుతున్న ప్రజల జీవన ప్రమాణాల మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# 8వ పే కమిషన్ కీలక అప్‌డేట్

ఎనిమిదవ వేతన సంఘం తెలుగు రాష్ట్రాల పర్యటన వివరాలు ఇవిగో.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్యత్తును నిర్ణయించే 8వ కేంద్ర వేతన సంఘం కార్యకలాపాలు ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. ప్రతి పదేళ్లకు ఒకసారి ఏర్పాటు చేసే ఈ కమిషన్, సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్ల జీతభత్యాలు, పెన్షన్ విధానాలను పునర్నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం ఈ కమిషన్ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ.. సంబంధిత భాగస్వాముల నుండి అభిప్రాయాలను సేకరించే పనిలో నిమగ్నమై ఉంది. ఉద్యోగ సంఘాలు, వివిధ మంత్రిత్వ శాఖల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కమిషన్ ఒక స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసింది. దీని ప్రకారం 2026 మే 13, 14 తేదీలలో ఢిల్లీలో రైల్వే, రక్షణ మంత్రిత్వ శాఖల పరిధిలోని యూనియన్లతో కీలక సమావేశాలు జరగనున్నాయి. ఆ తర్వాత కమిషన్ తన పర్యటనను దక్షిణాదికి విస్తరిస్తూ, మే 18-19 తేదీలలో హైదరాబాద్‌లో తెలంగాణకు చెందిన వాటాదారులతో చర్చలు జరుపుతుంది. జూన్ నెలలో పర్యటనలు ఉత్తరాదికి మారుతాయి; జూన్ 1 నుండి 4 వరకు జమ్మూ & కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో, ఆపై జూన్ 8న లడఖ్‌లో సమావేశాలు నిర్వహిస్తారు. వీటితో పాటు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కూడా ప్రత్యేక సమావేశం ఉంటుందని కమిషన్ వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2025లో ప్రకటించబడిన ఈ కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాష్ దేశాయ్ అధ్యక్షత వహిస్తున్నారు. ఇందులో సభ్యులుగా ప్రొఫెసర్ పులక్ ఘోష్, సభ్య కార్యదర్శిగా పంకజ్ జైన్ వ్యవహరిస్తున్నారు. ఈ ప్యానెల్ కేవలం వేతనాలను పెంచడమే కాకుండా, కరువు భత్యం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్, ఇతర అలవెన్సుల విషయంలో శాస్త్రీయమైన విశ్లేషణ చేస్తుంది. కార్మిక సంఘాలు, పెన్షన్ సంస్థలు, వివిధ విభాగాల నుండి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కొత్త వేతన నిర్మాణాన్ని సిఫార్సు చేస్తుంది. 8వ వేతన సంఘం: మీ జీతం ఎంత పెరగబోతోంది? కేంద్రం కీలక నిర్ణయం! భాగస్వాములందరికీ తమ వినతులను సమర్పించేందుకు తగిన సమయం కల్పించాలనే ఉద్దేశంతో, కమిషన్ మెమోరాండం సమర్పణ గడువును 2026 మే 31 వరకు పొడిగించింది. నిజానికి



ఈ ప్రక్రియ మార్చిలో ప్రారంభమై ఏప్రిల్‌తో ముగియాల్సి ఉన్నప్పటికీ, అభ్యర్థనల మేరకు ఒక నెల అదనపు సమయం ఇచ్చారు. ఈ సంప్రదింపుల ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత, కమిషన్ ప్రారంభమైన 18 నెలలకు, అంటే 2025 నవంబర్ 3 నాటికి తుది నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదికలో సూచించే అంశాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవన ప్రమాణాలను మరియు ఆర్థిక భవిష్యత్తును గణనీయంగా ప్రభావితం చేస్తాయి.

# కాల్పుల విరమణపై ఇరాన్ కీలక నిర్ణయం

### ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించిన టెహ్రాన్..అమెరికా యుద్ధ విమానం కూల్చివేత

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. అమెరికా - ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు విఫలం కావడమే కాకుండా, క్షేత్రస్థాయిలో సైనిక ఘర్షణలు మొదలైనట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం.. ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దేందుకు అమెరికా ప్రతిపాదించిన 48 గంటల కాల్పుల విరమణను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.అమెరికా తన ప్రతిపాదనను ఒక అజ్ఞాత మూడవ దేశం ద్వారా బుధవారం నాడు ఇరాన్‌కు పంపినట్లు సమాచారం. అయితే, టెహ్రాన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడం ద్వారా తన పట్టుదలను ప్రదర్శించింది. ఇరాన్ యొక్క పాక్షిక అధికారిక సంస్థ 'ఫార్స్ న్యూస్' ఈ విషయాన్ని ధృవీకరించగా.. అల్ జజీరా వంటి అంతర్జాతీయ సంస్థలు దీనిని ప్రముఖంగా ప్రచురించాయి. మధ్యవర్తిత్వం వహించిన దేశం పేరు బయటకు రానప్పటికీ, చర్చల ద్వారా శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు ప్రస్తుతానికి నిలిచిపోయాయని స్పష్టమవుతోంది.ఈ ఉద్రిక్తతల నడుమ ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఇరాన్ గగనతలంపై అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్ కూల్చివేయబడింది. బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ లేకెన్‌హీత్ స్థావరానికి చెందిన ఈ విమానాన్ని ఇరాన్ దళాలు కూల్చివేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ రకమైన విమానంలో సాధారణంగా ఇద్దరు సిబ్బంది (పైలట్, ఆయుధ వ్యవస్థల అధికారి) ఉంటారు.ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..ఇరాన్ యుద్ధంతో స్టాక్ మార్కెట్ కుదేల్.. ఆస్తులు కాపాడుకోవడానికి పెట్టుబడిదారులకు కీలక సూచనలు ఇవిగో..సిఎన్ఎన్ నివేదిక ప్రకారం.. కూలిపోయిన విమానంలోని ఒక సిబ్బంది సభ్యుడిని అమెరికా సైన్యం సురక్షితంగా రక్షించింది. ప్రస్తుతం అతను అమెరికా రక్షణలో చికిత్స పొందుతున్నాడు. అయితే, రెండో సిబ్బంది సభ్యుడి పరిస్థితిపై ఇంకా స్పష్టత రాలేదు. టెహ్రాన్ నుండి సుమారు 470 కిలోమీటర్ల



దూరంలో ఉన్న ఖుజెస్తాన్ ప్రావిన్స్‌లోని కరూన్ నది సమీపంలో ఈ విమానం కూలిపోయింది. ఇరాన్ మీడియా ఈ ఘటనకు సంబంధించిన శకలాల ఫోటోలను, వీడియోలను విడుదల చేసింది. అందులో హెలికాప్టర్లు తక్కువ ఎత్తులో ఎగురుతూ గాలింపు చర్యలు చేపడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) లేదా వైట్ హౌస్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇరాన్ గగనతలంపై ఒక అమెరికా యుద్ధ విమానం కూల్చివేయబడటం ఇదే మొదటిసారి అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య నేరుగా యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఒకవైపు చమురు ధరలు పెరుగుతుండటం, మరోవైపు ఇలాంటి సైనిక ఘర్షణలు చోటుచేసుకోవడం ప్రపంచ మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి. ఏప్రిల్ నెల గడిచే కొద్దీ ఈ ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయోనన్న భయం పెట్టుబడిదారులలో వ్యక్తమవుతోంది.

# భారత్ ఒక ఏడాది పాటు బంగారం కొనడం ఆపేస్తే ఏం జరుగుతుంది



కేంద్రం అసలు ప్లాన్ ఇదే! మన భారతీయులకు బంగారం అంటే కేవలం ఒక లోహం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్. పెళ్లిళ్లయినా, పండుగలైనా బంగారం కొననిదే మనకు ముచ్చట తీరదు. అయితే, ఒకవేళ భారత్ ఒక సంవత్సరం పాటు విదేశాల నుంచి బంగారం దిగుమతి చేసుకోవడం పూర్తిగా ఆపేస్తే ఏం జరుగుతుందో ఎప్పుడైనా ఆలోచించారా? దీనివల్ల ప్రపంచ మార్కెట్ నుంచి మన ఇంటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రపంచ మార్కెట్లో పసిడి ధరల పతనం? భారత్ ఏటా దాదాపు 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటుంది. అంటే ప్రపంచంలోనే అతిపెద్ద కొనుగోలుదారులలో మనం ఒకరం. ఒక్కసారిగా భారత్ నుంచి డిమాండ్ తగ్గిపోతే, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు దారుణంగా పడిపోయే అవకాశం ఉంది. మార్కెట్లో బంగారం ఎక్కువగా ఉండి, కొనేవారు తక్కువగా ఉండటం వల్ల గ్లోబల్ ప్రైసెస్ కరెక్షన్ కి గురవుతాయి. కానీ విచిత్రం ఏమిటంటే, ప్రపంచ మార్కెట్లో ధరలు తగ్గినా, మన దేశంలో మాత్రం లభ్యత తక్కువగా ఉండటం వల్ల ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. మన ఆర్థిక వ్యవస్థకు లాభమా? నష్టమా? బంగారం అనేది పెట్రోల్ తర్వాత భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే రెండో వస్తువు. దీని కోసం మనం ఏటా దాదాపు $60 నుంచి $70 బిలియన్ల విదేశీ కరెన్సీని ఖర్చు చేస్తున్నాం. ఒకవేళ ఈ కొనుగోళ్లు ఆపితే, ఆ డాలర్లన్నీ ఆదా అవుతాయి. దీనివల్ల మన రూపాయి విలువ పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ డెఫిసిట్ తగ్గుతుంది. ఆ మిగిలిన సొమ్మును క్రూడ్ ఆయిల్ వంటి అత్యవసర వనరుల కోసం ప్రభుత్వం వాడుకోవచ్చు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక రకంగా మేలు చేస్తుంది. పరిశ్రమపై ప్రతికూల ప్రభావం మరోవైపు, ఈ నిర్ణయం వల్ల 'జెమ్స్ అండ్ జ్యువెలరీ' రంగం తీవ్రంగా దెబ్బతింటుంది. మన దేశంలో ఈ రంగంపై దాదాపు ఒక కోటి మందికి పైగా కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. బంగారం అమ్మకాలు నిలిచిపోతే, వారందరూ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే మార్కెట్లో ఈ వార్తల వల్ల జ్యువెలరీ కంపెనీల షేర్లు పతనం అవుతున్నాయి. పైగా, ప్రభుత్వం చట్టపరంగా బంగారంపై ఆంక్షలు విధిస్తే.. స్మగ్లింగ్ పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే మన దేశంలో పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం అవసరం కచ్చితంగా ఉంటుంది, కాబట్టి ప్రజలు దొంగచాటుగానైనా కొనడానికి ప్రయత్నిస్తారు. ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే! ప్రజలు భౌతికంగా బంగారాన్ని కొని దాచుకోవడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్దగా ఉపయోగం ఉండదు. అందుకే ప్రభుత్వం గోల్డ్ ఈటీఎఫ్‌లు , సావరిన్ గోల్డ్ బాండ్ల వైపు ప్రజలను మళ్లించే ప్రయత్నం చేస్తోంది. దీనివల్ల మీకు బంగారం ధర పెరిగినప్పుడల్లా లాభం వస్తుంది, కానీ దిగుమతి చేసుకునే అవసరం ఉండదు. మరోవైపు, సామాన్యులను కొనొద్దని చెబుతున్నా.. దేశ ఆర్థిక భద్రత కోసం ఆర్బీఐ మాత్రం తన వద్ద రికార్డు స్థాయిలో 880 టన్నుల బంగారాన్ని నిల్వ ఉంచుతోంది. మొత్తానికి, భారత్ బంగారం కొనడం ఆపేస్తే ఆర్థికంగా డాలర్లు ఆదా అవ్వొచ్చు కానీ, సామాజికంగా , ఉపాధి పరంగా భారీ ఇబ్బందులు తప్పవు. బంగారం అనేది మన సంస్కృతిలో భాగం కాబట్టి, డిమాండ్ అనేది ఎప్పటికీ తగ్గకపోవచ్చు.

# స్టాక్ మార్కెట్‌లో సంచలనం



వ్యాల్యూ 360 ఐపీఓ లిస్టింగ్.. ఇన్వెస్టర్లకు లాభాల పంట పండుతుందా వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ నేడు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో అడుగుపెట్టింది. ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈ ప్లాట్‌ఫామ్‌పై ఈ కంపెనీ షేర్లు లిస్ట్ అయ్యాయి. భారతీయ పబ్లిక్ రిలేషన్స్‌రంగంలో ఇదొక కీలక మైలురాయిగా నిలవనుంది. మార్కెట్ ప్రారంభంలో ఓపెనింగ్ ప్రైస్ ఎలా ఉంటుందోనని ఇన్వెస్టర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సర్వీస్ సెక్టార్‌లో కనిపిస్తున్న భారీ వృద్ధికి ఈ పరిణామం ఒక నిదర్శనం. ఈ ఐపీఓకు రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. మూడు రోజుల బిడ్డింగ్ సమయంలో షేర్లకు భారీ డిమాండ్ ఏర్పడిందని మార్కెట్ నిపుణులు గమనించారు. సర్వీస్ ఆధారిత స్టార్టప్ మోడల్స్‌పై ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకాన్ని ఈ ఆసక్తి చాటిచెబుతోంది. గత రెండు దశాబ్దాలుగా ఈ సంస్థ సాధించిన వృద్ధికి ఈ లిస్టింగ్ ధర అద్దం పడుతోంది. దేశీయ కన్సల్టింగ్ ఏజెన్సీల విజయగాథలో ఇదొక అరుదైన ఘట్టం. వ్యాల్యూ 360 కమ్యూనికేషన్స్ ఐపీఓ లిస్టింగ్ విశేషాలు ఇన్వెస్టర్లను ఆకర్షించేలా కంపెనీ తన ప్రైస్ బ్యాండ్‌ను నిర్ణయించింది. ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఎక్స్‌పాన్షన్, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం ఉపయోగించనున్నారు.

# ప్రభాస్ ఫ్యాన్స్ షాక్ -- సప్తగిరి వ్యాఖ్యలపై క్లారిటీ!



మారుతి దర్శకత్వంలో వచ్చిన 'ది రాజా సాబ్' ఏకంగా రూ. 350 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన విజువల్ వండర్. ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ నటిస్తున్న సినిమాను చిన్న సినిమా అనడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. టాలీవుడ్ కమెడియన్ సప్తగిరి చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే లేపాయి. తన కొత్త సినిమా 'పురుష:' ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ, ప్రభాస్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'ది రాజా సాబ్'ను చిన్న సినిమాల లిస్టులో చేర్చడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే ఆయన కావాలని అనలేదని, మాటల ప్రవాహంలో అలా వచ్చిందని సన్నిహితులు చెబుతున్నారు. అసలు సప్తగిరి ఏమన్నారు? దీనిపై వస్తున్న రియాక్షన్స్ ఏంటో ఒకసారి చూద్దాం. ప్రభాస్ మూవీ 'చిన్న' సినిమానా?: మారుతి దర్శకత్వంలో వచ్చిన 'ది రాజా సాబ్' ఏకంగా రూ. 350 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన విజువల్ వండర్. ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ నటిస్తున్న సినిమాను చిన్న సినిమా అనడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రెస్ మీట్‌లో సప్తగిరి మాట్లాడుతూ.. "నేను ఇటీవల సరస్వతి, రాజా సాబ్, పురుష వంటి చిత్రాల్లో నటించాను. అవి చిన్న స్థాయి సినిమాలు కావడంతో ప్రేక్షకులకు పెద్దగా రీచ్ అవ్వలేదు, కానీ నేను మూవీస్ కంటిన్యూ గా చేస్తున్న అని" వ్యాఖ్యానించారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఫ్లోలో జరిగిన పొరపాటా: సప్తగిరి వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే ఈ విషయాన్ని నిశితంగా గమనిస్తే, ఆయన ప్రభాస్ సినిమాను తక్కువ చేయాలనే ఉద్దేశంతో అన్నట్లు అనిపించడం లేదు. తను వరుసగా చేస్తున్న సినిమాల గురించి చెబుతూ, ఫ్లోలో ఆ పేరు కూడా వాడేసినట్లు కనిపిస్తోంది. ఒక కమెడియన్‌గా ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండే సప్తగిరి, అంత పెద్ద ప్రాజెక్టును తక్కువ చేయరని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. 'పురుష:' పైనే సప్తగిరి ఫోకస్: ప్రస్తుతం సప్తగిరి తన తదుపరి చిత్రం 'పురుష:' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాకు వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో సప్తగిరితో పాటు వెన్నెల కిషోర్ కూడా నటిస్తుండటంతో కామెడీ డోస్ గట్టిగానే ఉంటుందని తెలుస్తోంది. జూన్ 22న విడుదల కానున్న ఈ సినిమా గ్లింప్స్ మరియు టీజర్స్ ఇప్పటికే ఆడియన్స్‌లో మంచి హైప్ క్రియేట్ చేశాయి. క్లారిటీ ఇచ్చే ప్రయత్నం: ఇక కొందరు సప్తగిరి ఉద్దేశం అది కాదని, ఆయన కేవలం తన సినిమాల రిలీజ్ మరియు పబ్లిసిటీ గురించి సాధారణంగా మాట్లాడారు తప్ప, ప్రభాస్ క్రేజ్‌ను కానీ, సినిమా బడ్జెట్‌ను కానీ ఉద్దేశించలేదు. ఏదేమైనా ఒక చిన్న మాట ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారి, సినిమా ప్రమోషన్స్‌కు అనూహ్యమైన పబ్లిసిటీని తెచ్చిపెట్టింది. సప్తగిరి వ్యాఖ్యలు ప్రభాస్ అభిమానులను కాస్త ఇబ్బంది పెట్టినా అది కేవలం మాట పొరపాటే అని సర్దుకుపోవడం మంచిది అని ఫ్యాన్స్ భావించాలని కొందరు కోరుతున్నారు.ఇక ఆయన నటించిన 'పురుష:' జూన్ 22న బాక్సాఫీస్ వద్దకు రాబోతోంది. కొత్త హీరో పవన్ కళ్యాణ్ బత్తులకి ఈ సినిమా ఎలాంటి గుర్తింపు తెస్తుందో, సప్తగిరి-వెన్నెల కిషోర్, కాంబో మనల్ని ఎంతలా నవ్విస్తుందో చూడాలి



# నితిన్ సైన్స్ ఫిక్షన్ మూవీ.. ఇప్పట్లో కష్టమేనా?



టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి మార్కెట్ సంపాదించినా.. గత కొన్నేళ్లుగా మాత్రం సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. భీష్మ తర్వాత ఆ రేంజ్ హిట్ ను అందుకోలేకపోయిన నితిన్.. వరుసగా సినిమాలు చేస్తున్నా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు రావడం లేదు. ముఖ్యంగా గతేడాది విడుదలైన రాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలపై అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నా.. రెండూ నిరాశపరిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో నితిన్ కొత్త ప్రాజెక్టుల ఎంపికలో జాగ్రత్తగా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నారి సిరిసవాడ, టి సోమశేఖర్ ఆ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయ్ సినిమా ఫేమ్ అంజి కె. మణిపుత్ర చెప్పిన కథ నచ్చడంతో ఆ ప్రాజెక్ట్ ను కూడా ముందుకు తీసుకెళ్లాలని నితిన్ భావిస్తున్నారట. అయితే నాగవంశీ తన సినిమాను వీలైనంత త్వరగా పూర్తి చేసి విడుదల చేయాలనే ప్లాన్ లో ఉన్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే దర్శకుడు వీఐ ఆనంద్ తో నితిన్ చేయాల్సిన సైన్స్ ఫిక్షన్ మూవీపై మాత్రం అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొదట ఆ ప్రాజెక్ట్ పై మంచి హైప్ ఏర్పడింది. ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఒక్కక్షణం, ఊరు పేరు భైరవకోన లాంటి విభిన్న కథలతో గుర్తింపు తెచ్చుకున్న వీఐ ఆనంద్.. నితిన్ కోసం కూడా ఓ కొత్త కాన్సెప్ట్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరిగింది. ఆ సినిమా సైన్స్ ఫిక్షన్ జానర్ లో తెరకెక్కనుందని, అన్నదమ్ముల నేపథ్యంతో కథ సాగుతుందని సమాచారం. అంతేకాదు ఇందులో నితిన్ డ్యూయల్ రోల్ చేయనున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత నితిన్ మరోసారి డ్యూయల్ రోల్ లో కనిపించే అవకాశం ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. గతంలో ఆయన చేసిన అల్లరి బుల్లోడులో డబుల్ రోల్ కనిపించినా.. ఆ సినిమా ఆశించిన ఫలితం ఇవ్వలేదు. అయితే ఇప్పుడు ఆ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ ముందుకు సాగడంలో ప్రధాన అడ్డంకి బడ్జెట్ గా మారినట్లు తెలుస్తోంది. సైన్స్ ఫిక్షన్ కథ కావడంతో భారీ వ్యయంతో తెరకెక్కించాల్సిన పరిస్థితి ఉందట. కానీ వరుస ఫ్లాపుల కారణంగా ప్రస్తుతం నితిన్ మార్కెట్ కొంత తగ్గిందనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో నిర్మాతలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కాస్త వెనకడుగు వేస్తున్నారని సమాచారం. అంతేకాదు కథలో కొన్ని మార్పులు చేయాలని నిర్మాత సూచించారని, ముఖ్యంగా సెకండాఫ్ విషయంలో సందేహాలు వ్యక్తమయ్యాయని టాక్. ఖర్చు తగ్గించేలా మార్పులు చేయాలని కోరినా.. దర్శకుడు వీఐ ఆనంద్ తన అసలు విజన్ ను మార్చేందుకు అంతగా ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ ప్రాజెక్టు ప్రస్తుతం తాత్కాలికంగా పక్కకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో నితిన్ వివిధ సినిమాలతో బిజీ కావడంతో.. వీఐ ఆనంద్ అదే కథను మరో హీరోకు వినిపించే ప్రయత్నంలో ఉన్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అదే సమయంలో నితిన్ మాత్రం ముందుగా సితార బ్యానర్ సినిమా ద్వారా స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా విజయం సాధిస్తే ఆయన మార్కెట్ మళ్లీ బలపడే అవకాశం ఉంది. అప్పుడు వీఐ ఆనంద్ తో సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ తిరిగి పట్టాలెక్కే ఛాన్స్ ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. అదే నిజమైతే ఇప్పట్లో ఆ సినిమా సెట్స్ పైకి వెళ్లడం కష్టమేనేమో! మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్.. హాట్ టాపిక్‌గా కృతిసనన్ కామెంట్స్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అక్కర్లేని భామ కృతిసనన్. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా టాలీవుడ్‌లో ఈ భామకున్న ఫ్యాన్ బేస్ ఎక్కువే అని చెప్పాలి. చాలా కాలంగా హిందీ సినిమాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ కాస్ట్ కటింగ్ కారణంగా హీరోయిన్లు ఎలా ప్రభావితం అవుతున్నారో చెప్పుకొచ్చింది కృతిసనన్. బడ్జెట్ నియంత్రణలో భాగంగా నిర్మాతలు మొదట హీరోయిన్ల పారితోషికం తగ్గించడంపైనే ఫోకస్ పెడుతున్నారని తాజాగా ఓ చర్చ నెట్టింట కొనసాగుతుంది. ఈ విషయమై కృతిసనన్ మాట్లాడుతూ.. మధ్య శ్రేణి (మిడ్ రేంజ్ హీరోయిన్లు) రెమ్యునరేషన్లను నిర్మాతలు పున: పరిశీలిస్తున్నారంది. అయితే ఇండస్ట్రీలో స్టార్ హీరోలకు ఇచ్చే భారీ రెమ్యునరేషన్లపై ఇప్పటికీ అతి తక్కువ స్థాయిలో చర్చ నడుస్తుందని చెప్పింది. కాస్ట్ కటింగ్ ఎఫెక్ట్ ప్రధానంగా హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులపైనే పడుతుందని అభిప్రాయపడ్డింది. అదే సమయంలో కేవలం టాప్ హీరోల రెమ్యునరేషన్లు తగ్గించుకుంటేనే మార్పు మొదలవుతుందని ఓ వర్గానికి చెందిన దర్శకనిర్మాతలు నమ్ముతున్నారని చెప్పుకొచ్చింది. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే బ్యాక్ టు బ్యాక్ బాక్సాఫీస్ ఫెయిల్యూర్స్ కారణంగా, థియాట్రికల్ రెవెన్యూ పడిపోవడం కారణంగా నిర్మాతలు ప్రొడక్షన్ ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.

# బుట్టబొమ్మ తొలిసారి హద్దులు చెరిపేసిందా?



బుట్టబొమ్మగా ఫేమస్ అయిన పూజాహెగ్డే కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు వరుస విజయాలతో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న ముద్దుగుమ్మకు కొంతకాలంగా అదృష్టం కలిసిరావడం లేదు. తెలుగు,తమిళ్ లో కొన్ని సినిమాలు చేతిలో ఉన్నా? అవి రిలీజ్ అయి సక్సెస్ అయ్యే వరకూ గానీ అమ్మడి కెరీర్ ఎలా ఉంటుందన్నది క్లారిటీ రాదు. ప్రస్తుతం వరుణ్ ధావన్ సరసన -హై జవాని- అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతోనైనా బాలీవుడ్ లో మళ్లీ సక్సెస్ అందుకోవాలని ఆశపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ముంబై వర్గాల్లో ఓ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. పూజా హెగ్డే ఈ చిత్రం కోసం గ్లామర్ హద్దులను చెరిపేసి నటిపస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా తన సినిమాల్లో గ్లామర్‌కు ప్రాధాన్యత ఇచ్చే పూజా ఈ హిందీ ప్రాజెక్ట్ కోసం మరింత బోల్డ్‌గా కనిపించబోతోందని సమాచారం. బాలీవుడ్ నెటిజన్లను , యువతను ఆకట్టుకోవడానికి ఆమె ఈ విధమైన మేకోవర్ ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. -హై జవాని- చిత్రం యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోంది. వరుణ్ ధావన్ వంటి ఎనర్జిటిక్ హీరో సరసన పూజా నటిస్తుండటంతో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందనే అంచనా లుంటాయి. ముఖ్యంగా పాటల్లో , కొన్ని కీలక సన్నివేశాల్లో పూజా గతంలో ఎన్నడూ లేని విధంగా గ్లామర్ యాంగిల్‌ను ప్రదర్శించబోతోందని బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. నటనకే పరిమితం కాకుండా బోల్డ్ యాంగిల్ తోనైనా తాను అనుకున్నది సాధించలనే పట్టుదలతో కనిపిస్తుంది. ప్రచార చిత్రాలు , లీక్ అయిన వార్తలు మాత్రం అమ్మడు అందాల ఆరబోతపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. సౌత్ సినిమాల్లో పద్ధతిగా కనిపించి మెప్పించిన భామ నార్త్ మార్కెట్ కోసం ఇలా రూట్ మార్చడం చర్చనీ యాంశమైంది. మారుతోన్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడంలో భాగంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వరుస పరాజయాలు ఎదురైనప్పుడు నటీనటులు ఇమేజ్‌ను మార్చుకోవడం సహజం. పూజా హెగ్డే కూడా అదే బాటలో పయనిస్తుంది. -హై జవాని- సక్సెస్ ఆమె బాలీవుడ్ కెరీర్‌కు ఊపిరి పోయడమే కాదు. మళ్లీ టాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించడానికి దోహదప డుతుందని అమ్మడు బలంగా నమ్ముతుంది. షూటింగ్ దశలోనే ఇంతటి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా విడుదల తర్వాత ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి. మొత్తంగా పూజా హెగ్డే కెరీర్ గ్రాఫ్‌ను మళ్లీ పైకి తీసుకెళ్లడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. హద్దులు చెరిపేయడం అనేది గ్లామర్ పరంగానే కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉందనే సంకేతంగా భావించొచ్చు.

# రిలేషన్‌షిప్స్‌పై కొత్త ఫిలాసఫీ ఫరియా వ్యాఖ్యలు హాట్ టాపిక్

టాలీవుడ్ లో చిట్టిగా కుర్రాళ్ల మనసు దోచుకున్న ఫరియా అబ్దుల్లా, కేవలం అందంతోనే కాదు తన ఆలోచనలతోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రీసెంట్‌గా ప్రేమ, పెళ్లి గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా రిలేషన్‌షిప్స్ విషయంలో ఫరియా చెప్పిన కొత్త ఫిలాసఫీ విని చిట్టి మామూలు పిల్ల కాదు.. చాలా డెప్త్ ఉంది, అంటూ జనాలు కామెంట్స్ చేస్తున్నారు. ఆమె చెప్పిన ఆ ఆసక్తికర విషయాలేంటో ఇప్పుడు చూద్దాం. ప్రేమ వేరు.. పెళ్లి వేరు: చాలామంది ప్రేమ, పెళ్లి రెండూ ఒకటే అనుకుంటారు. కానీ ఫరియా దృష్టిలో ఇవి రెండూ పూర్తిగా వేరు వేరు అంశాలట. "ప్రేమ అనేది ఒక అద్భుతమైన అనుభూతి. మనల్ని ఒకరు ప్రేమిస్తున్నారు అన్న ఆలోచనే మనకి ఎంతో ధైర్యాన్ని, సంతోషాన్ని ఇస్తుంది. కానీ పెళ్లి అనేది ఒక బాధ్యత. ఒక మనిషి తనను తాను పూర్తిగా మార్చుకోవడానికి, కొత్తగా పరిచయం చేసుకోవడానికి పెళ్లి ఉపయోగపడుతుంది" అని ఫరియా తన అభిప్రాయాన్ని పంచుకుంది. పెళ్లి అర్థం మారిపోతుందా?: ప్రస్తుత జనరేషన్ పెళ్లి పట్ల ఆసక్తి కోల్పోతున్న విషయాన్ని ఫరియా చాలా క్లోజ్ గా అబ్జర్వ్ చేస్తోంది. "ఈ కాలం యువత ఆలోచనలు మారుతున్నాయి. భవిష్యత్తులో వివాహం అనే పదానికి అర్థమే మారిపోవచ్చు" అని ఆమె అనడం హాట్ టాపిక్ అయ్యింది. రిలేషన్‌షిప్స్‌ను పెళ్లి అనే ఓక చక్రం లో కాకుండా, సెల్ఫ్ ట్రాన్స్‌ఫార్మేషన్ లాగా చూడటం నిజంగా ఒక కొత్త పాయింట్ ఆఫ్ వ్యూ. మల్టీ టాలెంటెడ్ మాయమ్మ: ఇక కేవలం నటనకే పరిమితం కాకుండా ఫరియా తనలోని ఇతర కోణాలను కూడా బయటపెడుతోంది. రీసెంట్ గా 'జెట్లీ' సినిమాకు డబ్బింగ్ చెప్పింది, అలాగే 'మత్తు వదలరా-2'లో ఒక పాటకు లిరిక్స్ రాసి కొరియోగ్రఫీ కూడా చేసింది. అంతేకాదు, డైరెక్షన్ మీద ఉన్న ఇష్టంతో వచ్చే ఏడాది నుండే మెగా ఫోన్ పట్టేందుకు ట్రయల్స్ మొదలుపెడతానని హింట్ ఇచ్చింది. ఇక ఫరియాలోని ఈ ఆల్ రౌండర్ టాలెంట్ చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.'భగవంతుడు'తో రా ఫ్యాక్షన్ డ్రామా: ఇప్పటివరకు మోడ్రన్ పాత్రలు చేసిన ఫరియా, మొదటిసారి ఒక సీరియస్ రోల్ లో మనల్ని అలరించబోతోంది. తిరువీర్ హీరోగా వస్తున్న 'భగవంతుడు' చిత్రంలో ఆమె ఒక గ్రామీణ యువతిగా కనిపించనుంది. 1990ల నాటి పల్నాడు ఫ్యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో సాగే ఈ సినిమాలో తన పాత్ర చాలా సవాలుగా ఉంటుందని ఫరియా చెప్పుకొచ్చింది. ఇక ఏప్రిల్ లేదా మే నెలలో రిలీజ్ కానున్న ఈ పాన్-ఇండియా మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. మొత్తానికి ఫరియా అబ్దుల్లా అటు సినిమాల్లోనూ, ఇటు తన ఫిలాసఫీతోనూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటోంది. +వఅ~ మనస్తత్వాన్ని రిఫ్లెక్ట్ చేస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు సమాజంలో మారుతున్న బంధాల విలువలను గుర్తు చేస్తున్నాయి. మరి 'భగవంతుడు' సినిమాలో ఫరియా పర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతుందో, ఆమె డైరెక్షన్ కల ఎప్పుడు నెరవేరుతుందో వేచి చూడాల్సిందే!



PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com